PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 13-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 345 Issue: 345

Circulated to Telangana
Published from Jagitial

13 జూన్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:45 సూర్యాస్తమయం - సా. 6:47 తిథి త్రయోదశి సా. 4:04 వరకు తరువాత చతుర్దశి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం కృతిక రా. 1:140 వరకు తరువాత రోహిణి యోగం సుకర్మ సా. 5:23 వరకు కరణం గరజి తె. 5:55 వరకు వనిజ సా. 4:04 వరకు వర్జ్యం మ. 2:41 నుండి సా. 4:06 వరకు దుర్ముహూర్తం ఉ. 7:29 నుండి ఉ. 8:21 వరకు రాహుకాలం ఉ. 9:00 నుండి ఉ. 10:38 వరకు యమగండం మ. 1:53 నుండి మ. 3:31 వరకు గుళికాకాలం తె. 5:45 నుండి ఉ. 7:23 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:09 నుండి తె. 4:57 వరకు అమృత ఘడియలు రా. 11:09 నుండి రా. 12:34 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:50 నుండి మ. 12:42 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున






## ఓకే.. డీల్!

### తుది దశలో ఇరాన్- అమెరికా ఒప్పందం

### ఇరాన్ విదేశాంగ మంత్రి వెల్లడి

టెహ్రాన్: పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులను ముగించడానికి అమెరికా – ఇరాన్ దేశాలు ఒక కీలక ఒప్పందానికి చాలా దగ్గరగా వచ్చాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి ప్రకటించారు. అరాఘ్చి తన ఎక్స్ ఖాతాలో చేసిన పోస్టులో, 'ఇస్లామాబాద్ అవగాహన ఒప్పందం' గతంలో ఎప్పుడూ లేనంతగా తుది దశకు చేరుకుందని తెలిపారు. ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలు అధికారికంగా వెలువడే వరకు మీడియా సంయమనం పాటించాలని, ఊహించి చెప్పవద్దని పేర్కొన్నారు. ఇటీవల కొన్ని ఇరానియన్ మీడియా సంస్థలు ఈ ఒప్పందానికి సంబంధించిన వివరాలను ప్రచురించాయి. దీనిపై స్పందించిన అరాఘ్చి, ప్రభుత్వం పారదర్శకంగా వ్యవహరిస్తుందని, ఒప్పందం ఖరారైన తర్వాత అన్ని వివరాలను ప్రజలకు వెల్లడిస్తామని చెప్పారు. కాగా, పూర్తిస్థాయి కాల్పుల విరమణ, 60 రోజుల అణు చర్చలు, ఆంక్షల మినహాయింపు సహా మొత్తం 14 అంశాలతో కూడిన అవగాహన ఒప్పందం ప్రతిపాదనల గురించి ప్రతినిధుల బృందంలోని-2 వ పేజీలో...



## హమ్మయ్యా.. డీల్ ఓకే!

వాషింగ్టన్: అమెరికాతో ఒప్పందం తుది దశలో ఉందని ఇరాన్ విదేశాంగ మంత్రి అరాఘ్చి పోస్ట్ చేయడంతో.. ట్రంప్ ఊపిరి పీల్చుకున్నారు. అరాఘ్చి పోస్టును తన సోషల్ మీడియా వేదికలో షేర్ చేస్తూ.. ఒప్పందం తుది దశలో ఉందన్నట్లు వెల్లడించారు. గురువారం అర్ధరాత్రి ఇరాన్ అంతం చూస్తానని ప్రకటించిన కొద్ది సేపటికే శాంతి ఒప్పందం కుదరబోతోందని వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్మూజ్ జలసంధి మళ్లీ తెరుచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఇరాన్‌పై వైమానిక దాడులను రద్దు చేశామని వెల్లడించారు. అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, పాకిస్థాన్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఈజిప్ట్ దేశాలు ఈ ఒప్పందానికి మద్దతు ఇస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు.



## ఫోన్లు పిరం

### తగ్గేది ఉండదిక

### నథింగ్ సీఈవో వెల్లడి

రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్‌ల ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని ప్రముఖ టెక్ కంపెనీ 'నథింగ్' సీఈఓ కార్ల్ పీ హెచ్చరించారు. ప్రపంచవ్యాప్తంగా మెమొరీ చిప్‌ల ధరలు విపరీతంగా పెరగడమే దీనికి ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు.

బీజింగ్: 'గత 15 సంవత్సరాలుగా స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ ఒకే ఒక నమ్మకంపై నడిచింది.. అదేంటంటే, 'ఏటా టెక్నాలజీ పెరిగే కొద్దీ ఫోన్ విడిభాగాల ధరలు తగ్గుతూ వస్తాయి. దీనివల్ల కంపెనీలు తక్కువ ధరలోనే ఎక్కువ ర్యామ్, మెరుగైన స్టోరేజ్, తరువాయి 2 వ పేజీలో...





## వాన చుక్కలు

### రాష్ట్రానికి భారీ వర్షాల హెచ్చరిక.. 14 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ

### చురుగ్గా నైరుతి రుతుపవనాలు

### హైదరాబాద్‌ను ముంచెత్తిన వాన

### సీఎం విమానం బెంగళూరుకు మళ్లింపు

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): వాతావరణ శాఖ అంచనాల ప్రకారం రంగారెడ్డి, నల్లగొండ, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, యాదాద్రి భువనగిరి, సూర్యాపేట, జనగామ, ఖమ్మం, మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కొన్ని ప్రాంతాల్లో స్వల్ప వ్యవధిలోనే అధిక వర్షపాతం నమోదయ్యే సూచనలు ఉన్నాయి. గంటకు 60 కిలో మీటర్ల వేగంతో ఈదురుగాలులు వీలుస్తాయని వాతావరణ శాఖ పేర్కొంది. మరోవైపు ఉత్తర, తూర్పు తెలంగాణ జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 41 నుంచి 43 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదయ్యే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. హైదరాబాద్ సిటీలో భారీవర్షం కురిసింది. శుక్రవారం రాత్రి ఉరుములు, తరువాయి 2 వ పేజీలో...

తెలంగాణలో వర్షాలు విస్తారంగా కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. నైరుతి రుతుపవనాలు చురుకుగా మారడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలకు వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొంది. దీంతో అధికారులు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచిస్తున్నారు.



## మందు చుక్కలు

### భారీగా పెరగనున్న మద్యం ధరలు





మద్యం ప్రియులకు తెలంగాణ ప్రభుత్వం పట్టపగలే చుక్కలు చూపించేందుకు సిద్ధమైంది. కొంత కాలంగా రాష్ట్రంలో మద్యం ధరల పెంపుపై చర్చ జరుగుతోంది. ఇప్పటికే ఎక్సైజ్ శాఖ కొత్త ధరలపై ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది. లిక్కర్ తయారీ కంపెనీల ఒత్తిడితో మద్యం ధరలను భారీగా పెంచేందుకు ప్రభుత్వం అడుగులు వేసినట్లు ని వార్తలు వచ్చాయి.

### ఫుల్ బాటిల్ రూ.80దాకా పెంపు!.. ప్రీమియం అయితే రూ.120 దాకా

### ఎల్లుండి నుంచే కొత్త ధరలు!?.. సీఎం రేవంత్ సంతకమే లేట్!!

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): ఈ నేపథ్యంలో తాజా ప్రతిపాదనలకు ప్రభుత్వం ఆమోదం తెలిపిన తరువాత.. ఈ నెల 15వ తేదీ నుంచి పెంచిన మద్యం రేట్లు అమల్లోకి తెచ్చే విధంగా రంగం సిద్ధం అవుతోంది. ముడిసరుకుల ధరలు, రవాణా ఖర్చులు బాగా పెరిగిన నేపథ్యంలో మద్యం ధరలను కూడా పెంచాలని లిక్కర్ కంపెనీలు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇప్పటికే కోరుతున్నాయి. ఈ క్రమంలో మద్యం ధరలను ఎంతమేర పెంచాలన్న దానిపై ప్రభుత్వం ఏప్రిల్ నెలలో త్రిసభ్య కమిటీని నియమించింది. ఈ కమిటీ మూడు రోజులుగా మద్యం తయారీ కంపెనీల ప్రతినిధులతో చర్చలు జరిపింది. కమిటీ చర్చలు పూర్తి కావటంతో ధరలపై తరువాయి 2 వ పేజీలో...







బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.14,858 |
| వెండి (కిలో): | రూ.2,65,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,316 |

## జగన్‌కు అనుమతి ఎందుకియ్యలే?



### శాంతిభద్రతల వల్లే పవన్‌కు అనుమతి నిరాకరణ

### అందరికీ మంత్రి పదవులు ఇవ్వలేం కదా.. మీడియాతో చిట్ చాట్‌లో సీఎం రేవంత్ రెడ్డి

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ తెలంగాణ నవనిర్మాణ సంకల్ప సభకు పోలీసులు అనుమతి ఇవ్వకపోవడంపై సీఎం రేవంత్ రెడ్డి స్పనందించారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'తెలంగాణలో జనసేన పార్టీ పెట్టొచ్చు. పవన్ రావొచ్చు. ఆయనే స్వయంగా పోటీ కూడా చేయొచ్చు. ఎవరు వద్దన్నరు. అని రేవంత్ వ్యాఖ్యానించారు. అయితే.. నువ్వు ఏ రాష్ట్రంలో పార్టీ పెట్టాలని అనుకున్నవో.. ఎక్కడ నీ జెండా ఎగరాలని అనుకున్నవో .. ఆ బిడ్డలను తిట్టొచ్చా. మా తెలంగాణ బిడ్డలను అంటే మాకు పౌరుషం రాదా? అందుకే.. పవన్‌పై మావోళ్లు తీవ్రంగా రియాక్ట్ అయ్యారు. అని రేవంత్ చెప్పారు.

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): ఇక, ఆనాడు.. సభకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక ఎలాంటి కుట్రలు లేవని.. పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారించార'ని తెలిపారు. ఈ విచారణలో.. శాంతి భద్రతల సమస్య వచ్చే అవకాశం ఉందన్నారని.. దీంతోనే అనుమతి నిరాకరించామని చెప్పారు. 'ఆరోజు తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం. ప్రజలంతా సంతోషంగా ఉన్నారు. ఆ సమయంలో ఆయన వచ్చి.. ఏం మాట్లాడతాడో అని పోలీసులు భావించారు. ఏచిన్న పొరపాటు మాట మాట్లాడినా.. తెలంగాణ జనాలు ఊరుకుంటరా? అందుకే.. సభకు వద్దన్నాం' అని రేవంత్ స్పష్టం చేశారు. అయితే.. దీనిని తప్పుగా చూపించే ప్రయత్నం చేశారని విమర్శించారు. ఇదిలావుంటే.. ఆనాడు జగన్ కూడా బాధితుడేనని రేవంత్ వ్యాఖ్యానించడం గమనార్హం. గతంలో జగన్ సభలకు ఏపీలోనూ అనుమతి ఇవ్వలేదని.. దీంతో ఆయన కూడా బాధపడ్డాడని.. దీనికి పవన్ కల్యాణ్ తరువాయి 2 వ పేజీలో...



## రేవంత్ బీఆర్ఎస్‌కు మంచే చేశారు!

### మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌కు అధికారం కల్ల

### ఫ్యూచర్ లేని నాయకుడు రేవంత్

### మీనాక్షి నామినేషన్ తిరస్కరణ సరికాదు

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ప్రత్యర్థి బీజేపీనే. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుంది. బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేయడం మాకు కలిసొచ్చింది. వ్యక్తిగతంగా రేవంత్ రెడ్డికి నాకు పంచాయితీలు లేవు. విధానపరమైన నిర్ణయాలపై మాత్రమే పంచాయతీ. రేవంత్‌రెడ్డి నిర్ణయాలు కాంగ్రెస్ మరో 20 ఏళ్లు అధికారంలోకి రాకుండా చేస్తుంది. రేవంత్ నిర్ణయాలు బీఆర్ఎస్‌కు మంచిది' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు.

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): శుక్రవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించిన ఆయన.. 'రేవంత్‌రెడ్డి ఫ్యూచర్ లేని నాయకుడు.. ఫ్యూచర్ సిటీ అంతకంటే లేదు. జూలైలో డీలిమిటేషన్ బిల్లు చేస్తారని సమాచారం ఉంది. దేశంలో డీలిమిటేషన్ చేయక పోయినా రాష్ట్ర విభజన అంశంలోనే పొందుపరిచారు కాబట్టి రెండు తెలుగు రాష్ట్రాల్లో డీ లిమిటేషన్ చేయాలని ఉంది. డీలిమిటేషన్ తర్వాతనే సీట్లు ఎవరికి అనేది తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



బ్రెజిల్ పోలీసులు ఓ చిలుకను అరెస్టు చేసిన ఘటన 2019లో చోటుచేసుకుంది. 2019లో పియావీ రాష్ట్రంలో ఓ కొకైన్ అడ్డాపై పోలీసులు దాడి చేసినప్పుడు, ఆ చిలుక పోలీసుల రాకపై ముందుగానే హెచ్చరించింది. ఈ విషయం తెలిసి దాన్ని అరెస్టు చేశారు. అయితే, పోలీసుల ముందు అది ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. పోలీసుల రాకపై యజమానులను హెచ్చరించిన ఆ చిలుకకు, అపరిచితుల ముందు పూర్తిగా మౌనం పాటించేలా శిక్షణ ఇచ్చారు. బ్రెజిల్ నేర చరిత్రలో చిలుక ఒక విచిత్రమైన అధ్యాయంగా నిలిచింది.



## మీనాక్షి నటరాజన్‌కి నిరాశే

### పిటిషన్ తిరస్కరించిన సుప్రీంకోర్టు.. ఆర్వో నిర్ణయంలో జోక్యం చేసుకోబోమని వెల్లడి

న్యూఢిల్లీ: తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ కు సుప్రీంకోర్టులోనూ ఊరట దక్కలేదు. మధ్యప్రదేశ్ నుంచి తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని ఈ మేరకు స్పష్టం చేసింది. మీనాక్షి నటరాజన్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సీనియర్ లాయర్, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఆమె తరఫున హాజరై వాదనలు వినిపించారు. ఎలాంటి క్రిమినల్ కేసులు ఆమెపై లేవని, కేవలం సమన్లు మాత్రమే తరువాయి 2 వ పేజీలో...


## వాట్సాప్.. వాట్సప్?

### ప్రపంచవ్యాప్తంగా సేవలకు అంతరాయం.. మొరాయించిన ఫేస్‌బుక్, ఇన్‌స్టా



సోషల్ మీడియా దిగ్గజం 'మెటా' సంస్థకు చెందిన వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ సేవలు ప్రపంచవ్యాప్తంగా ఒకేసారి స్తంభించిపోయాయి. శుక్రవారం సాయంత్రం సాంకేతిక లోపం కారణంగా ఈ మూడు ప్లాట్‌ఫారమ్‌లు గంటల తరబడి నిలిచిపోవడంతో కోట్లాది మంది వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

న్యూఢిల్లీ: ఇటీవలి కాలంలో మెటా నెట్‌వర్క్‌లో సంభవించిన అతిపెద్ద గ్లోబల్ అవుటేజ్ లలో ఇది ఒకటిగా నిలిచింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో అకౌంట్లు ఉన్నపళంగా లాగౌట్ అయిపోవడం, కొత్తగా లాగిన్ అవ్వడానికి ప్రయత్నిస్తే ఎర్రర్ రావడం, హోమ్ ఫీడ్ అసలు లోడ్ కాకపోవడం వంటి సమస్యలు తలెత్తాయి. వాట్సాప్‌లో కేవలం 'కనెక్టింగ్' అని మాత్రమే చూపిస్తూ, పంపిన సందేశాలు వెళ్లకుండా, అవతలి వారి నుంచి రాకుండా నిలిచిపోయాయి. వాయిస్, వీడియో కాల్స్ కూడా పనిచేయలేదు. 'డౌన్‌డిటెక్టర్' వెబ్‌సైట్ - 2 వ పేజీలో...



## తొలి ట్రిలియనీర్.. ఎలాన్ మస్క్

### చరిత్ర సృష్టించిన స్పేస్ ఎక్స్ ఐపీవో

న్యూయార్క్: ఎలాన్ మస్క్.. భూ మండలంపైనే తొలి ట్రిలియనీర్‌గా అవతరించాడు. లక్ష కోట్ల రూపాయల వ్యక్తిగత ఆస్తులతో సరికొత్త చరిత్ర సృష్టించారు. శుక్రవారం ఎలాన్ మస్క్‌కు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ అయ్యింది. ఈ ఐపీవో సైతం అంచనాలను మించి సక్సెస్ అయ్యింది. స్పేస్ ఎక్స్ షేర్లకు డిమాండ్ తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

13.6.2026

మేషం: దూర ప్రయాణాలలో జాగ్రత్త అవసరం. ఉద్యోగాలలో ప్రతికూల వాతావరణం ఉంటుంది. బంధు మిత్రులతో ఆలోచించి మాట్లాడటం మంచిది. ఆదాయ మార్గాలు తగ్గుతాయి. వృధా ఖర్చులు పెరుగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మందకొడిగా సాగుతాయి.

వృషభం: చిన్ననాటి మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ఆర్థిక పరిస్థితి మెరుగుపడి పాత ఋణాలు తీర్చగలుగుతారు. ఉద్యోగాలలో నూతన అవకాశములు లభిస్తాయి. చేపట్టిన వ్యవహారాలు అప్రయత్నంగా పూర్తవుతాయి. వృత్తి వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి.

మిధునం: చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. జీవిత భాగస్వామితో దైవ దర్శనాలు చేసుకుంటారు. నిరుద్యోగులకు లభించిన అవకాశములు సద్వినియోగం చేసుకోవాలి. దూరపు బంధువులు నుండి ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి.

కర్కాటకం: ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించలేరు. బంధు మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతన పెట్టుబడులు నష్టం కలిగిస్తాయి.

సింహం: దూర ప్రయాణాలలో వాహన ప్రమాద సూచనలున్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన చికాకు కలిగిస్తుంది. సంతాన ఆరోగ్య విషయంలో వైద్య సంప్రదింపులు అవసరమౌతాయి. దీర్ఘకాలిక ఋణ భాధలు పెరుగుతాయి. వ్యాపార లావాదేవీలు మందగిస్తాయి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమౌతుంది.

కన్య: ఆప్తులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ధన వ్యవహారాలు సజావుగా సాగుతాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు అనుకూలంగా సాగుతాయి. సంఘంలో ప్రముఖుల సహాయ సహకారాలు అందుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

తుల: నూతన వాహనం కొనుగోలు చేస్తారు. సమాజంలో ప్రముఖులతో పరిచయాల వలన ఆర్థిక పురోగతి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో సోదరుల నుండి విలువైన సమాచారం అందుతుంది. ఉద్యోగస్థుల శ్రమకు తగిన గుర్తింపు లభిస్తుంది.

వృశ్చికం: కుటుంబ సభ్యుల ప్రవర్తన మానసికంగా చికాకు కలిగిస్తుంది. ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. నూతన ఋణాలు చేస్తారు. బంధు మిత్రులు మీ మాటతో విబేదిస్తారు. చేపట్టిన పనులలో అవరోధాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఉద్యోగమున అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

ధనస్సు: ముఖ్యమైన పనులలో కీలక నిర్ణయాలు చెయ్యలేరు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వృత్తి వ్యాపారాలలో వివాదాలు తప్పవు. ఆర్థిక వ్యవహారాలలో ఆశించిన పురోగతి ఉండదు. నిరుద్యోగుల కష్టం ఫలించదు. ఉద్యోగస్తులకు అదనపు పనిభారం ఉంటుంది.

మకరం: బంధు మిత్రులతో గృహమున ఆనందంగా గడుపుతారు. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. అధికారుల సహాయంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. మంచి మాట తీరుతో అందరిని ఆకట్టుకుంటారు. సంతానం విద్యా విషయాలలో శుభవార్తలు అందుతాయి. వృత్తి, వ్యాపారాలలో నూతన అవకాశాలు లభిస్తాయి.

కుంభం: స్థిరాస్తి విషయమై సోదరులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆర్థిక వాతావరణం సమస్యాత్మకంగా ఉంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు నిరాశ కలిగిస్తాయి. జీవిత భాగస్వామితో స్వల్ప వివాదాలు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది.

మీనం: దీర్ఘకాలిక ఋణాలు తీర్చగలుగుతారు. విలువైన వస్త్ర, ఆభరణాలు కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి సంభందిత వివాదాలు నుండి బయటపడతారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. వృత్తి ఉద్యోగాలలో ఆశించిన స్థానచలనాలుంటాయి. నిరుద్యోగులకు ఉన్నతావకాశములు లభిస్తాయి. వ్యాపార లావాదేవీలు అనుకూలిస్తాయి.



# వాన చుక్కలు

మొదటి పేజీ తరువాయి

మెరుపులతో సిటీవ్యాప్తంగా జోరువాన కురవడంతో జనజీవనం స్తంభించింది. రెండు గంటలకు పైగా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. పలు చోట్ల ట్రాఫిక్ జామ్ కారణంగా వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, మెహదీపట్నం లో భారీ వర్షం కురిసింది. కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్ లో ఉరుములతో కూడిన వర్షం పడింది. నిజాంపేట్ , బాచుపల్లి, ప్రగతినగర్ లో మోస్తరు వాన కురిసింది. కుత్బుల్లాపూర్, గాజుల రామారం, అల్వాల్ మచ్చ బొల్లారంలో వర్షం బీభత్సం సృష్టించింది. నార్సింగి, మణికొండ, పుప్పాలగూడలో వాన దంచికొట్టింది. బండ్లగూడ జాగీర్, కిస్మత్ పురా ,హిమాయత్ సాగర్ లో మోస్తరు వర్షం పడింది. నాంపల్లి, అబిడ్స, కోఠి, బషీర్ బాగ్ లో ఈదురుగాలులతో కూడిన వాన పడింది. భారీ వర్షం కారణంగా వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శంషాదబాద్ ఎయిర్ పోర్టు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షం కురవడంతో ఢిల్లీ నుంచి హైదరాబాద్ కు వస్తున్న సీఎం రేవంత్ రెడ్డి విమానం ల్యాండింగ్ కు అంతరాయం ఏర్పడింది. వాతావరణ అనుకూలించకపోవడంతో ఏటీసీ అధికారులు ఫ్లైట్ ల్యాండింగ్ కు అనుమతించలేదు. దీంతో విమానాన్ని బెంగళూరుకు దారి మళ్ళించారు.

# మందు చుక్కలు

మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదనలు సిద్ధ అయ్యాయి. మద్యం ధరలను 10శాతం నుంచి 15శాతం మధ్యలో పెంచాలని కంపెనీలు త్రిసభ్య కమిటీ సభ్యులకు విన్నవించాయి. మద్యం కంపెనీలు పేర్కొన్న ప్రకారం.. ఒక్కో ఫుల్ బాటిల్ పై గరిష్ఠంగా రూ.80 వరకు పెరిగే అవకాశం ఉందని, ప్రీమియం బ్రాండ్ల అయితే రూ.90దాకా పెరిగే అవకాశం ఉందని, కాస్ట్లీ బ్రాండ్ల (హై-ఎండ్) అయితే రూ.120పైనే పెంచే అవకాశం ఉందని తెలుస్తోంది. అయితే, గతేడాది ఫిబ్రవరిలోనే బీర్ల ధరలు పెంచిన నేపథ్యంలో ఈసారి బీర్ల ధర పెంపుకు అనుమతి లభించలేదు. ఈ కొత్త ధరలపై ప్రభుత్వం అధికారికంగా నిర్ణయం ప్రకటించాల్సి ఉంది. ప్రస్తుతం తెలంగాణ వ్యాప్తంగా 2,620 వైన్ షాపులు ఉండగా.. ఈ ధరల పెంపుదల వల్ల ప్రభుత్వ ఖజానాకు అదనంగా నెలకు రూ. 200 కోట్ల నుంచి రూ. 250 కోట్ల వరకు, అంటే వార్షిక ప్రాతిపదికన దాదాపు రూ. 2,400 కోట్ల నుంచి రూ. 3,000 కోట్ల మేర అదనపు ఆదాయం సమకూరనుంది.

### కొత్తగా 150 ఎంఎల్, 20 ఎంఎల్

మరోవైపు, ఎక్సైజ్ శాఖ మద్యం విక్రయాలకు సంబంధించి కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో ప్రస్తుతం అందుబాటులో ఉన్న మద్యం సీసాల పరిమాణాలకు అదనంగా కొత్త సైజులను ప్రవేశపెట్టబోతోంది. ఈ మేరకు పాత నిబంధనలను సవరిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం మార్కెట్లో 90 ఎంఎల్, 180 ఎంఎల్, 375 ఎంఎల్, 750 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం బాటిళ్లు అందుబాటులో ఉన్నాయి. వినియోగదారుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని వీటితో పాటు కొత్తగా 150 ఎంఎల్, 200 ఎంఎల్ పరిమాణాల్లో మద్యం సీసాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు ఎక్సైజ్ శాఖ ప్రకటించింది.

# మీనాక్షికి నిరాశే

మొదటి పేజీ తరువాయి

జారీ అయ్యాయని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం... ఆర్వో నామినేషన్ తిరస్కరణ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, గతంలో ఇటువంటి తీర్పులు ఏమైనా ఉంటే న్యాయస్థానం ముందు ఉంచాలని సూచించింది. అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరిస్తే.. ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడమే సరైందని పేర్కొంది. అవసరమైతే హైకోర్టుకు వెళ్లాలని ధర్మాసనం తెలిపింది. అనంతరం పిటిషన్ విచారణకు అర్హత లేదంటూ కొట్టివేసింది. తెలంగాణలో నమోదైన కేసు వివరాలను మీనాక్షి తన అఫిడవిట్‌లో వెల్లడించలేదని పేర్కొంటూ ఆమె నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించిన సంగతి తెలిసిందే.

### టీకాంగ్రెస్ నేతలు హింట్ ఇచ్చారు: మధ్యప్రదేశ్ సీఎం

మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణపై మధ్యప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నామినేషన్ తిరస్కరణ వెనుక ఎలాంటి బాహ్య శక్తులు లేవని, ఇది పూర్తిగా కాంగ్రెస్ పార్టీ అంతర్గత కుట్ర అని ఆరోపించారు. ఆమె వైఖరిపై తీవ్ర అసంతృప్తితో ఉన్న తెలంగాణ కాంగ్రెస్ నాయకులే వ్యూహాత్మకంగా ఈ నామినేషన్‌ను అడ్డుకున్నారని వ్యాఖ్యానించారు. ఒకరిపై ఒకరు నిందలు వేసుకోవడం కాంగ్రెస్ సంస్కృతి అని, అందులో భాగమే ఈ అంతర్గత రాజకీయ కుట్ర అని పేర్కొన్నారు. 'పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను రహస్యంగా బెంగుళూరుకు తరలించేందుకు ఒక పెద్ద ప్లాన్ సిద్ధమైంది. అయితే చివరి నిమిషంలో చార్టెడ్ ఫ్లైట్ ఆలస్యం కావడం వల్ల ఆ ప్లాన్ కాస్తా బెడిసికొట్టింది. ఆ అంశాలన్నింటినీ నిశితంగా పరిశీలిస్తే ఇది కచ్చితంగా తెలంగాణ కాంగ్రెస్ నాయకుల కుట్ర అని ఎవరికైనా స్పష్టంగా అర్థమవుతుంద'ని మోహన్ యాదవ్ వివరించారు.

# రేవంత్ బీఆర్ఎస్‌కు మంచే చేశారు!

మొదటి పేజీ తరువాయి

ఆలోచిస్తాం' అని వెల్లడించారు. ఇక, బీజేపీకి దగ్గరిగా ఉన్న వాళ్ళే మీనాక్షి వ్యవహారం బయటపెట్టారని కేటీఆర్ అన్నారు.'ఎవరు బయటపెట్టారో కాంగ్రెస్ వాళ్ళకి తెలుసు. మీనాక్షి నటరాజన్ కాంగ్రెస్ వాళ్లే ఓడ గొట్టారు. కాంగ్రెస్‌లో మీనాక్షి నటరాజన్ విషయం బయట పెట్టిన బ్లాక్ షిఫ్ ఎవరో తేల్చండి. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ మూడో ప్లేస్‌కి పరిమితమవుతుంది' అని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ సంస్థాగత బలోపేతంపై కూడా కేటీఆర్ కీలక వివరాలు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా 60కి పైగా నియోజకవర్గా ల్లో సభ్యత్వ నమోదు, ఎస్ఐఆర్ సమావేశాలు పూర్తయ్యాయని తెలిపారు. సభ్యత్వ నమోదు కోసం రూపొందిస్తున్న ప్రత్యేక యాప్ తుది దశలో ఉందని, త్వరలోనే పార్టీ శిక్షణ కార్యక్రమాలు ప్రారంభిస్తామని చెప్పారు. సభ్యత్వ నమోదు పూర్తయిన అనంతరం పార్టీ కమిటీలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో నిరుద్యోగుల సమస్యలను ప్రధాన అంశంగా తీసుకుని సరూర్‌నగర్‌లో భారీ సభ నిర్వహించనున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. యువత ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్తామని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు. పార్టీ అధినేత కేసీఆర్ భవిష్యత్‌లో బస్సు యాత్ర చేపట్టే అవకాశం ఉందని, అయితే దాని సమయం, షెడ్యూల్‌పై తుది నిర్ణయం కేసీఆరే తీసుకుంటారని పేర్కొన్నారు.

# జగన్‌కు అనుమతి ఎందుకియ్యలే?

మొదటి పేజీ తరువాయి

సమాధానం చెప్పాలని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. మరోవైపు, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీనే తనను కోరుకుంటున్నారని.. రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. తాను వెళ్లి మోడీని ఆలింగనం చేసుకోలేదని.. ఆయనే తన వద్దకు వచ్చి ఆలింగనం చేసుకున్నారని తెలిపారు. దీనిని బట్టి ఎవరు ఏం అర్థం చేసుకున్నా.. తనకు కానీ.. కాంగ్రెస్ పార్టీకి కానీ వచ్చే నష్టమేమీ లేదన్నారు. రాష్ట్రాల హక్కుల కోసం.. మోడీ పై కొట్లాట కొనసాగుతూనే ఉంటుందని చెప్పారు. ఈ విషయంలో రాజీ పడే ధోరణి కూడా లేదన్నారు. జీఎస్టీ సొమ్ముల్లో అన్యాయం జరుగుతోంది.. ప్రాజెక్టుల్లో అన్యాయం జరుగుతోందని చెప్పారు. వీటిని ప్రశ్నిస్తూనే ఉన్నామన్నారు. ఈ నెల 15 లోగా వడ్లు కొనకపోతే.. పెద్ద యుద్ధం జరిగినా ఆశ్చర్యం లేదని వ్యాఖ్యానించారు.

### అందరికీ మంత్రి పదవులు ఇవ్వలేం

మీడియాతో చిట్‌చాట్‌లో కేబినెట్ విస్తరణ గురించి రేవంత్ స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీతో తాను భేటీ అయిన విషయాన్ని వెల్లడించిన రేవంత్ రెడ్డి.. మంత్రి వర్గ విస్తరణకు సంబంధించి ఎలాంటి చర్చలు జరపలేదని తేల్చి చెప్పారు. ఇక కాంగ్రెస్ నేతలు, ఎమ్మెల్యేలు ఎవరైనా సరే పార్టీ అధిష్ఠానాన్ని కలుసుకునేందుకు వారికి పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ఈ క్రమంలోనే కాంగ్రెస్ పార్టీ తరఫున ఎన్నికల్లో గెలిచిన మొత్తం 66 మంది ఎమ్మెల్యేలు కూడా మంత్రి పదవి చేపట్టేందుకు అర్హులేనని రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.



కానీ రాజ్యాంగ నిబంధనల ప్రకారం మంత్రివర్గంలో కేవలం 17 మందికే అవకాశం ఉంటుందని గుర్తుచేశారు. ఇందుకోసం అనేక అంశాలను పరిగణలోకి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. సామాజిక, ప్రాంతీయ సమీకరణాలు.. పార్టీలో సీనియారిటీ.. పార్టీ పట్ల నిబద్ధత వంటి అనేక కారణాలను లోతుగా పరిశీలించి.. ఆ తర్వాతే మంత్రులుగా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

# తొలి ట్రిలియనీర్.. ఎలాన్ మస్క్

మొదటి పేజీ తరువాయి

విపరీతంగా పెరిగింది. నాలుగు రెట్లు డిమాండ్ ఎక్కువ వచ్చింది. ఐపీవో తర్వాత స్పేస్ ఎక్స్ కంపెనీ మార్కెట్ విలువ ఏకంగా 1.77 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. ఉద్యోగులకు ఇచ్చిన స్టాక్స్, ఇతర వాటా యూనిట్లను పరిగణలోకి తీసుకుంటే దాని విలువ 1.80 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని మార్కెట్ వర్గాలు స్పష్టం చేశాయి. ఆ కంపెనీ ప్రపంచంలోనే టాప్ 10 పబ్లిక్ కంపెనీల సరసన నిలిచింది. మరోవైపు, ఏపెన్ ఏఐ, ఆంత్రోపిక్ ఐపీవోలపై భారీ అంచనాలు పెరిగాయి. ఆ రెండు కంపెనీలు సైతం ట్రిలియన్ డాలర్ల విలువను చేరుకోవచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు.

# వాట్సాప్.. వాట్సప్?

మొదటి పేజీ తరువాయి

ప్రకారం.. కొద్ది నిమిషాల్లోనే ఒక్క ఫేస్‌బుక్ పైనే ఏకంగా 1,20,000 కి పైగా ఫిర్యాదులు నమోదయ్యాయి. ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్‌లకూ లక్షల్లో రిపోర్టులు వచ్చాయి. ఐ సమస్యతో వినియోగదారుల చాటింగ్‌లతో పాటు, మెటాకు చెందిన బిజినెస్ టూల్స్ అయిన ఆడ్స్ మేనేజర్, బిజినెస్ సూట్‌లు కూడా పూర్తిగా డౌన్ అయ్యాయి. దీనివల్ల డిజిటల్ మార్కెటింగ్ రంగం, ఆన్‌లైన్ వ్యాపారాలు గంటల తరబడి నిలిచిపోయి భారీగా నష్టపోయాయి.

# ఫోన్లు పిరం

మొదటి పేజీ తరువాయి

డిస్‌ప్లేలను వినియోగదారులకు అందించగలుగుతాయి. కానీ, ఇప్పుడు ఆ కాలం చెల్లిపోయింది, స్మార్ట్‌ఫోన్ తయారీ రంగంలో ఆర్థిక సమీకరణాలు పూర్తిగా మారిపోయాయి' అని వెల్లడించారు. ఈ సంక్షోభానికి అసలు కారణం 'ఏఐ' విప్లవమేనని కార్ల్ పీ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వాడకం విపరీతంగా పెరిగింది. పెద్ద పెద్ద టెక్ కంపెనీలు భారీ-ూ× డేటా సెంటర్లను నిర్మిస్తున్నాయి. ఈ డేటా సెంటర్లకు అత్యధిక సామర్థ్యం గల మెమొరీ చిప్‌లు అవసరమవుతాయి. దీనికోసం మైక్రోసాఫ్ట్, గూగుల్, మెటా, అమెజాన్ వంటి దిగ్గజ సంస్థలు ముందస్తుగానే మెమొరీ చిప్ సామర్థ్యాన్ని భారీగా కొనుగోలు చేస్తున్నాయి. దీనివల్ల చిప్స్ తయారుచేసే శాంసంగ్, మైక్రాన్, ఎస్‌కే హైనిక్స్ వంటి కంపెనీలు తమ దృష్టిని అటు వైపు మళ్లించాయి. ఫలితంగా, చరిత్రలో మొదటిసారిగా స్మార్ట్‌ఫోన్ పరిశ్రమ, ఏఐ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌తో నేరుగా పోటీ పడాల్సి వస్తోంది. సప్లై తక్కువగా ఉండి, డిమాండ్ విపరీతంగా ఉండటంతో మెమొరీ చిప్‌ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. గతంలో స్మార్ట్‌ఫోన్‌లలో వాడే ఒక మెమొరీ మాడ్యూల్ ధర సుమారు రూ.1,600 లోపు ఉండేది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల ప్రకారం, ప్రీమియం/ఫ్లాగ్‌షిప్ ఫోన్‌ల కోసం అదే మెమొరీ ధర సుమారు రూ.8,300 దాటిపోయే ప్రమాదం ఉంది. అంటే కేవలం ఫోన్లోని ఒక భాగం ధరలోనే దాదాపు 3 నుంచి 5 రెట్లు పెరుగుదల నమోదు కానుంది. ఈ సంక్షోభం నుంచి తమ కంపెనీ కూడా మినహాయింపు కాదని, రాబోయే రోజుల్లో నథింగ్ స్మార్ట్‌ఫోన్ల ధరలను కూడా పెంచక తప్పదని కార్ల్ పీ స్పష్టం చేశారు.

# ఓకే.. డీల్!

మొదటి పేజీ తరువాయి

సన్నిహిత వర్గాలను ఉటంకిస్తూ ఇరాన్ అధికారిక వార్తా సంస్థ మెహర్ నివేదించింది. ఈ అవగాహన ఒప్పందం ప్రకారం అన్ని రంగాల్లో యుద్ధం తక్షణమే నిలిపివేయడం, ఇరాన్ అణ్వాయుధాన్ని తయారు చేయబోమని ప్రకటన, అణు కార్యక్రమం సమస్యను పరిష్కారానికి చర్చలు ప్రారంభమవుతాయి.

### అవగాహన ఒప్పందంలోని 14 అంశాలు:

1. లెబనాన్ సహా అన్ని రంగాల్లో తక్షణమే యుద్ధం నిలిపివేయడం, పూర్తిస్థాయి శాశ్వత కాల్పులు విరమణ.
2. ఇరాన్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకోబోమని, ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ సార్వభౌమాధికారాన్ని గౌరవిస్తామని అమెరికా నిబద్ధత.
3. 30 రోజుల్లోగా నేవీ దిగ్బంధనాన్ని పూర్తిగా ఎత్తివేయడం.
4. ఇరాన్ చుట్టుపక్కల అమెరికా తన దళాలను ఉపసంహరించడం.
5. ఇరాన్ నిర్ధారించిన ఏర్పాట్ల ప్రకారం 30 రోజుల్లోగా హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం.
6. చమురు, పెట్రోకెమికల్ ఉత్పత్తులు, వాటి ఉత్పన్నాల అమ్మకంపై ఆంక్షలు తొలగించి, తద్వారా లభించే ఆర్థిక వనరులను ఇరాన్ పూర్తిగా వినియోగించుకునేలా చేయడం.
7. అమెరికా, దాని మిత్రదేశాలు ఇరాన్ కోసం కనీసం 300 బిలియన్ డాలర్ల విలువైన పునర్నిర్మాణ ప్రణాళికలను సమర్పించాలనే నిబంధన.
8. అణు సమస్యలు, అమెరికా ప్రాథమిక, ద్వితీయ ఆంక్షలను పూర్తిగా ఎత్తివేయడం, అలాగే ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి, అంతర్జాతీయ అణుశక్తి సంస్థ గవర్నర్ల బోర్డు సంబంధిత తీర్మానాలపై దృష్టి సారించి, తుది ఒప్పందాన్ని కుదుర్చుకోవడమే లక్ష్యంగా అరవై రోజుల పాటు చర్చలు జరపాలి.
9. అణు నిరాయుధీకరణ ఒప్పందం కింద అణ్వాయుధాలను ఉత్పత్తి చేయబోమని ఇరాన్ తన నిబద్ధతను పునరుద్ఘాటించడం.
10. చర్చల కాలంలో ఈ ప్రాంతంలో తన సైనిక బలగాలను పెంచబోమని, ఎటువంటి కొత్త ఆంక్షలను విధించబోమని అమెరికా హామీ ఇస్తుంది.
11. 60 రోజుల చర్చల కాలంలో స్తంభింపజేసిన 24 బిలియన్ డాలర్ల ఇరాన్ ఆస్తులను విడుదల చేయడం. ఈ మొత్తంలో సగం చర్చలు ప్రారంభం కావడానికి ముందే ఇరాన్‌కు అందుబాటులోకి తీసుకురావాలి.
12. ఒప్పందం అమలును నిర్ధారించడానికి ఒక పర్యవేక్షణ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయడం.
13. తుది ఒప్పందాన్ని ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి తీర్మానం ద్వారా ఆమోదిస్తారు.
14. ఇరాన్ స్తంభింపజేసిన ఆస్తులలో సగం విడుదలయ్యే వరకు, చమురు ఆంక్షలు తొలగింపు, నేవీ దిగ్బంధనం ఎత్తివేసేవరకు తుది చర్చలు ప్రారంభం కావు. తుది ఒప్పందం ప్రత్యేకంగా ఈ అంశాలపై దృష్టి సారిస్తుంది.

# ప్రైవేట్ ఆస్పత్రుల్లోనూ ఆయుష్మాన్ భారత్

**యాదాద్రి భువనగిరి జిల్లాలో పైలట్ ప్రాజెక్ట్**

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా రోగులు ఎవరైనా ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లగానే ముందుగా అవుట్ పేషెంట్(ఓపీ) విభాగంలో వారి ఆధార్ కార్డు నంబర్ ఆధారంగా 'ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్'(ఆభా) తయారు చేస్తున్నారు. ఈ అకౌంట్‌కు ఒక ప్రత్యేక నంబర్‌ను కూడా కేటాయిస్తున్నారు. ఈ ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్‌లో ఆ రోగికి సంబంధించిన సమగ్ర ఆరోగ్య సమాచారాన్ని అందులో నమోదు చేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలో కోటి మందికి పైగా రోగులకు ఈ హెల్త్ అకౌంట్ ఓపెన్ చేశారు. ఇప్పటివరకు ఈ హెల్త్ అకౌంట్ నమోదు ప్రక్రియ కేవలం ప్రభుత్వ హాస్పిటల్స్‌లోనే జరుగుతుండగా.. తెలంగాణలో పైలట్ ప్రాజెక్టుగా యాదాద్రి భువనగిరి జిల్లాలో ప్రారంభించాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే ఈ ప్రక్రియను కర్ణాటకతోపాటు దేశంలోని మరిన్ని రాష్ట్రాలు కూడా ప్రారంభించాయి. యాదాద్రి భువనగిరి జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టి.. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా విస్తరించేందుకు తెలంగాణ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కమిషనరేట్(సీహెచ్ఎఫ్‌డబ్ల్యూ) నిర్ణయించింది. ఒక్కో రోగికి ఆభా సంఖ్యను నమోదు చేస్తే.. రూ.20 వరకు ప్రభుత్వ ఆసుపత్రులకు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోంది. ప్రైవేటు ఆస్పత్రుల్లోనూ ఈ హెల్త్ అకౌంట్‌ను తీసుకు రావడం వల్ల దేశవ్యాప్తంగా వైద్యరంగంలో కీలక సంస్కరణలు అమలు చేసేందుకు అవకాశం ఉంటుందని సంబంధిత అధికారులు చెబుతున్నారు. ఇలా చేయడం వల్ల ప్రైవేట్ ఆస్పత్రులకు వచ్చే రోగుల సంఖ్య.. వారికి అందుతున్న వైద్య సేవలు.. చేస్తున్న రోగ నిర్ధారణ పరీక్షల వివరాలు మొత్తం ప్రభుత్వానికి తెలుస్తాయని పేర్కొంటున్నారు. రోగుల బ్లడ్ గ్రూప్ దగ్గరి నుంచి వారికి గతంలో జరిగిన ఆపరేషన్లు సహా అన్ని వివరాలు రికార్డుల్లో నమోదు కానున్నాయి. ఆ హెల్త్ రికార్డులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)తో అనుసంధానం చేయడం వల్ల హెల్త్‌కేర్ రంగంలో లెక్కలు పక్కాగా ఉంటాయని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. దీని వల్ల ఆరోగ్య రంగానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకోవడంలో ఉపయోగపడతాయని కేంద్ర ప్రభుత్వం ఆలోచిస్తోంది. అందుకే పైలట్ ప్రాజెక్ట్‌లో భాగంగా ప్రైవేట్ ఆస్పత్రుల యాజమాన్యాలకు దీనిపై శిక్షణ ఇచ్చి.. వాటి ఫలితాలు వచ్చిన తర్వాత రాష్ట్రం మొత్తం అమలు చేయాలని భావిస్తున్నారు. తెలంగాణలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టాన్ని పక్కాగా అమలు చేసేందుకు ప్రజారోగ్య విభాగం(డీపీహెచ్) ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. అందులో అన్ని ప్రైవేట్ ఆస్పత్రులకు కావాల్సిన అనుమతులన్నీ కచ్చితంగా ఆన్‌లైన్‌లో తీసుకోవాలనే రూల్ పెట్టింది. ఇక కేంద్రం తెచ్చిన ఆభా యాప్‌లో ఈ సంఖ్యను ఎవరికి వారు స్వంతంగా రూపొందించుకోవచ్చని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. ఆ యాప్‌లో మొదట ఆధార్ నంబర్‌ను ఎంటర్ చేసి.. ఆ తర్వాత మిగిలిన వివరాలను నమోదు చేస్తే ఆభా సంఖ్య వస్తుంది. దాన్ని ఆస్పత్రుల్లో ఇస్తే.. హెల్త్ రికార్డ్ మొత్తం వస్తుంది.




## ట్రాఫిక్ పోలీస్‌పై జీహెచ్ఎంసీ ఆఫీసర్ దాడి

బంజారాహిల్స్-హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో విధి నిర్వహణలో ఉన్న ఒక ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై ఇద్దరు జీహెచ్ఎంసీ అధికారులు దాడికి పాల్పడటం తీవ్ర సంచలనం సృష్టించింది. నిబంధనలకు విరుద్ధంగా వెళుతున్న వాహనాన్ని అడ్డుకోవడంతో, వారు తనపై భౌతిక దాడికి దిగారని బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. జూన్ 11, గురువారం నాడు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలోని లూసిడ్ బైలేన్‌లో ట్రాఫిక్ కానిస్టేబుల్ ఇ. శ్రీశైలం విధులు నిర్వర్తిస్తున్నారు. ఆ రహదారిపై నాలుగు చక్రాల వాహనాల ప్రవేశం నిషిద్ధం. అయితే, ఆ సమయంలో అటుగా వచ్చిన ఒక గ్రీన్ కలర్ క్రెటా కారును శ్రీశైలం నిలిపివేశారు. దీంతో కారులో ఉన్న జీహెచ్ఎంసీ అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ మెడికల్ ఆఫీసర్ ఆఫ్ హెల్త్ సహాయకుడు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. కారు డ్రైవర్ తనను దుర్భాషలాడటమే కాకుండా, ఉద్యోగం నుంచి తొలగిస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు శ్రీశైలం తన ఫిర్యాదులో పేర్కొన్నారు. వారిని పోలీస్ స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించగా, తనపై చేయి చేసుకుని కాలితో తన్నారని ఆరోపించారు. అనంతరం వారు బారికేడ్లను తొలగించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ ఘటనను శ్రీశైలం తన మొబైల్ ఫోన్‌లో చిత్రీకరించగా, సదరు వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. విధి నిర్వహణలో ఉన్న ప్రభుత్వ ఉద్యోగిని అడ్డుకోవడం, దాడి చేయడం, శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం మరియు బెదిరింపులకు పాల్పడటం వంటి అభియోగాలపై భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితులైన ఇద్దరు అధికారులను విచారణకు పిలిపించామని, ప్రస్తుతం దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు వెల్లడించారు.

## సుప్రీం తీర్పు ఎదురుదెబ్బ కాదు: మీనాక్షి

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): రాజ్యసభ నామినేషన్ తిరస్కరణపై సుప్రీంకోర్టులో చుక్కెదురైనప్పటికీ, ఇది తనకు ఎదురుదెబ్బ కాదని కాంగ్రెస్ నాయకురాలు మీనాక్షి నటరాజన్ అన్నారు. దేశంలో ప్రజాస్వామ్యానికి ఏం జరుగుతోందో ఈ ఘటనతో బహిర్గతమైందని ఆమె వ్యాఖ్యానించారు. రాజ్యాంగ సంస్థలపై గౌరవం ఉందని, అందుకే కోర్టు తీర్పుపై నేరుగా స్పందించనని తెలిపారు. ఈ పరిణామం తనను షాక్‌కు గురిచేయలేదని మీనాక్షి నటరాజన్ అన్నారు. ఎన్నికల కమిషన్ పనితీరుపై తమకు నమ్మకం లేదని, అయితే తమ న్యాయపరమైన వాదనలో ఎలాంటి బలహీనత లేదని ఆమె పేర్కొన్నారు.



మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు వేసిన తన నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ మీనాక్షి నటరాజన్ దాఖలు చేసిన పిటిషన్‌ను జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎ.ఎస్. చందూర్‌కర్‌లతో కూడిన ధర్మాసనం శుక్రవారం కొట్టివేసింది. నామినేషన్ తిరస్కరణకు గురైన తర్వాత, ఎన్నికల ప్రక్రియ కొనసాగుతున్నప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోలేవని స్పష్టం చేసింది. దీనిపై ఎన్నికల సంఘంలో పిటిషన్ ద్వారానే పరిష్కారం వెతుక్కోవాలని సూచించింది. 2022లో తెలంగాణలో నమోదైన ఒక క్రిమినల్ కేసుకు సంబంధించిన పూర్తి వివరాలను అఫిడవిట్‌లో వెల్లడించలేదని బీజేపీ అభ్యంతరం వ్యక్తం చేయడంతో జూన్ 9న రిటర్నింగ్ అధికారి ఆమె నామినేషన్‌ను తిరస్కరించారు. అయితే, రెండేళ్లకు పైగా శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల వివరాలు మాత్రమే వెల్లడించాల్సి ఉంటుందని, ఈ కేసులో కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని ఆమె తరఫు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ వాదించారు.

## దుబాయ్‌లో గుండెపోటుతో మెదక్ వాసి మృతి

చేగుంట-మెదక్, జూన్ 12 (ఈవార్తలు): ఉపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లిన ఓ తెలంగాణ యువకుడు గుండెపోటుతో అకాల మరణం చెందాడు. మెదక్ జిల్లా చేగుంట మండలం వడియారం గ్రామానికి చెందిన చింతకింది సాయి కిరణ్ (35) దుబాయ్‌లో మృతిచెందడంతో అతని కుటుంబంలో, గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది. కుటుంబ సభ్యులు అందించిన వివరాల ప్రకారం సాయికిరణ్‌కు నాగలక్ష్మితో వివాహమై ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ పోషణ కోసం గతేడాది మే నెలలో ఆయన దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడ పనిచేస్తుండగా, ఈ నెల 2వ తేదీన తీవ్రమైన గుండెపోటు రావడంతో మరణించాడు. ఈ విషయం ఆలస్యంగా కుటుంబ సభ్యులకు తెలియడంతో వారు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. సాయికిరణ్ మరణ వార్తతో వడియారం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. కుటుంబానికి పెద్ద దిక్కును కోల్పోయామని బంధువులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సాయికిరణ్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వగ్రామానికి తెప్పించాలని కోరుతూ ఆయన కుటుంబ సభ్యులు 'సీఎం ప్రవాసీ ప్రజావాణి'ని ఆశ్రయించారు. తమకు సహకరించి, మృతదేహాన్ని భారత్‌కు తరలించే ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# 'సర్'కు సహకరించండి

**రాజకీయ పార్టీలకు సీఈవో వినతి.. 25 నుంచి ఇంటింటికీ వచ్చి వివరాల సేకరణ**

**జూలై 31న ముసాయిదా, అక్టోబర్ 1న తుది జాబితా**



హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) 2026 కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల సహకారాన్ని కోరుతూ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) సి. సుదర్శన్ రెడ్డి శుక్రవారం సమావేశం నిర్వహించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా నమోదు చేయడమే కాకుండా, జాబితాలోని అవకతవకలను తొలగించి, అత్యంత పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే తమ లక్ష్యమని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు. హైదరాబాద్‌లోని బీఆర్‌కేఆర్ భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో, జూన్ 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభం కానున్న ఈ ప్రక్రియ విధివిధానాలను వివిధ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఇంటింటి సర్వే, ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తుల స్వీకరణ, జూలై 31న ముసాయిదా జాబితా ప్రచురణ, అభ్యంతరాల పరిష్కారం, తుది జాబితా విడుదల వంటి వివిధ దశల గురించి అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. ఈ బృహత్తర కార్యక్రమానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు తమ పూర్తి మద్దతును ప్రకటించారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం, బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) జూన్ 25 నుండి జూలై 24 వరకు ఇంటింటి సర్వేను నిర్వహిస్తారు. అనంతరం స్వీకరించిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితాను ప్రకటిస్తారు. అభ్యంతరాలు, విజ్ఞప్తుల స్వీకరణ ప్రక్రియ అనంతరం, పూర్తిస్థాయి పరిశీలన పూర్తి చేసి అక్టోబర్ 1న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు సీఈఓ సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. గత రెండు దశాబ్దాలలో రాష్ట్రంలో ఇంతటి సమగ్ర స్థాయిలో ఓటర్ల జాబితా ప్రక్షాళన జరగడం ఇదే మొదటిసారి. నకిలీ ఓట్లు, మరణించిన వారి పేర్లు, చిరునామా మారిన వారిని జాబితా నుంచి తొలగించడంతో పాటు, అర్హులైన కొత్త ఓటర్లను చేర్చడమే ఈ ప్రత్యేక సవరణ ముఖ్య ఉద్దేశం. నిబంధనల ప్రకారం క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ఏ ఒక్కరి పేర్లను జాబితా నుంచి తొలగించబోమని, ఈ ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరుగుతుందని అధికారులు భరోసా ఇచ్చారు. పౌరుల సందేహాల నివృత్తికి రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు వారు పేర్కొన్నారు.

# యథావిధిగా సింగరేణి మెడికల్ బోర్డు!

**త్వరలో ప్రారంభిస్తామన్న డిప్యూటీ సీఎం భట్టి**



హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): సింగరేణి కార్మికులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. త్వరలోనే సింగరేణి మెడికల్ బోర్డును యథావిధిగా ప్రారంభించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. మెడికల్ బోర్డును పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మెడికల్ బోర్డులో అక్రమాలు, మధ్యవర్తిత్వానికి తావులేకుండా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల వారసులకు కారుణ్య నియామకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. శనివారం మంచిర్యాలలో 335 మంది వారసులకు ఉద్యోగ నియామక పత్రాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. సింగరేణిలో మారుపేర్ల సమస్య పరిష్కారానికి న్యాయ నిపుణుల సలహాలతో ముందుకు సాగుతున్నామని భట్టి చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత సింగరేణిలో మొత్తం 2,657 ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలిపారు. ఇందులో 2,102 కారుణ్య నియామకాలు, 555 ప్రత్యక్ష ఉద్యోగాల భర్తీ చేశామన్నారు. కారుణ్య నియామకాల కోసం వయోపరిమితిని 35 ఏళ్ల నుంచి 40 ఏళ్లకు పెంచినట్లు వెల్లడించారు. 40 వేల మంది సింగరేణి ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ప్రమాద బీమా సదుపాయం కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగుల కోసం రూ.10 లక్షల ఉచిత సహజ మరణ బీమా అమలు చేస్తున్నామని వెల్లడించారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.40 లక్షల ప్రమాద బీమాతో పాటు బోనస్ చెల్లిస్తున్నామని డిప్యూటీ సీఎం చెప్పారు. గత రెండేళ్లలో సింగరేణి కార్మికులకు రూ.1,500 కోట్ల లాభాల వాటాను పంపిణీ చేసినట్లు తెలిపారు. సింగరేణి ఆస్పత్రులను ఆధునికీకరిస్తున్నామని, గోదావరిఖనిలో అత్యాధునిక క్యాథ్ ల్యాబ్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొత్త బొగ్గు బ్లాకులను సాధించి మరిన్ని ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

## మతం మారినోళ్ల ఎస్సీ హోదా రద్దు చేయాలి

**డీజీపీకి డిప్యూటీ స్పీకర్ రఘురామ లేఖ**

అమరావతి, జూన్ 12 (ఈవార్తలు): ఏపీలో ఎవరైనా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేస్తే, సదరు ఫిర్యాదుదారుడి ఎస్సీ హోదాను తప్పనిసరిగా పరిశీలించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఏపీ డీజీపీని కోరారు. ఈ మేరకు ఆయన డీజీపీకి ఒక లేఖ రాశారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల ఎస్పీలకు దీనిపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. అట్రాసిటీ చట్టం దుర్వినియోగం కాకుండా నిరోధించేందుకే ఈ చర్యలు అవసరమని ఆయన తన లేఖలో స్పష్టం చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు వెలువరించిన ఒక తీర్పును రఘురామ తన లేఖలో ప్రస్తావించారు. ఆ తీర్పు ప్రకారం క్రైస్తవ మతంలోకి మారిన వారు ఎస్సీ హోదాను కోల్పోతారని, వారికి అట్రాసిటీ చట్టం కింద ఎలాంటి హక్కులు వర్తించవని ఆయన గుర్తు చేశారు. అందువల్ల అట్రాసిటీ చట్టం కింద ఎవరైనా ఫిర్యాదు చేసినప్పుడు, ఎఫ్ఐఆర్ నమోదుకు ముందు గానీ, లేదా నమోదు చేసిన వెంటనే గానీ ఫిర్యాదుదారుడి కుల హోదాను క్షుణ్ణంగా ధ్రువీకరించుకోవాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. మతం మారి ఎస్సీ హోదా కోల్పోయిన వారి నుంచి అట్రాసిటీ కేసులను స్వీకరించకుండా చూడాలని రఘురామ డీజీపీని కోరారు. కాగా, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇటీవల కాలంలో డీజీపీకి లేఖలు రాయడం ఇది రెండోసారి. గతంలో రాష్ట్రంలోని ప్రార్థనా స్థలాల్లో అనధికారికంగా ఏర్పాటు చేసిన లౌడ్‌స్పీకర్ల వల్ల శబ్ద కాలుష్యంపై ఆయన ఫిర్యాదు చేశారు. లౌడ్‌స్పీకర్ల అధిక శబ్దం వల్ల విద్యార్థులు, వృద్ధులు, రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ విషయంలో సుప్రీంకోర్టు మార్గదర్శకాలను కఠినంగా అమలు చేయాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించి, పబ్లిక్ న్యూసెన్స్ సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే సౌండ్ సిస్టమ్‌లను స్వాధీనం చేసుకోవాలని ఆ లేఖలో సూచించారు. రాష్ట్రమంతటా నిబంధనలు ఒకే విధంగా అమలయ్యేలా చూడాలని ఆయన కోరారు.

## పోలీస్ స్టేషన్ ముందు జేసీ స్నానం

తాడిపత్రి, జూన్ 12 (ఈవార్తలు): ఏపీలోని తాడిపత్రిలో టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. పోలీసుల తీరుకు నిరసనగా ఆయన ఏకంగా టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుటే స్నానం చేశారు. అక్కడే వంటావార్పునకు కూడా సిద్ధమై తన నిరసనను వినూత్న రీతిలో కొనసాగించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాదిరిగానే ఇప్పుడూ పోలీసులు తమపై కక్ష సాధిస్తున్నారని, మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి కొమ్ముకాస్తున్నారని జేసీ ఆరోపించారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం పెద్దారెడ్డిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఆయన దీక్షకు దిగారు. తనకు 74 ఏళ్ల వయసని, పదవులపై ఆశ లేదని, కానీ పోలీసుల తీరుకు భయపడేది లేదని స్పష్టం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి నిరసనతో పోలీసులు వెనక్కి తగ్గారు. రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలపై కేతిరెడ్డి పెద్దారెడ్డిపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ 196(1) కింద కేసు నమోదు చేశారు. దీంతో ప్రభాకర్ రెడ్డి తన దీక్షను విరమించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన జేసీ, తాడిపత్రిలో నెలకొన్న పరిస్థితులపై జిల్లా ఎస్పీతో తేల్చుకుంటానని అన్నారు. ఇందుకోసం వచ్చే సోమవారం తన అనుచరులతో కలిసి ఎస్పీ కార్యాలయానికి వెళ్లనున్నట్లు ప్రకటించారు. ఈ పోరాటానికి టీడీపీకి ఎలాంటి సంబంధం లేదని, ఇది పూర్తిగా తన వ్యక్తిగత విషయమని ఆయన స్పష్టం చేశారు. "మేము తాడిపత్రిలో ఉండాలా? వద్దా? అనే విషయాన్ని నేరుగా ఎస్పీనే అడిగి తెలుసుకుంటాం" అని జేసీ వ్యాఖ్యానించారు.

మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## ఖమ్మం బాధితురాలికి హరీశ్ పరామర్శ

**పోక్సో కింద నిందితుడు గౌస్ అరెస్ట్**

ఖమ్మం/హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): తెలంగాణలోని ఖమ్మం పట్టణంలో 12 ఏళ్ల బాలికపై జరిగిన అమానుష దాడి రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపుతోంది. బాలికపై లైంగిక దాడికి యత్నించి, ఆమెను ఒక అపార్ట్‌మెంట్ మూడో అంతస్తు నుంచి కిందకు తోసేసిన ఈ ఘటనపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ ప్రమాదంలో వెన్నెముక, పక్కటెముకలు, చేతులకు తీవ్ర గాయాలైన బాధితురాలు ప్రస్తుతం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వివరాల్లోకి వెళితే.. జూన్ 6న ఖమ్మంలోని రాపర్తి నగర్‌లో ఈ దారుణం చోటుచేసుకుంది. అదే అపార్ట్‌మెంట్‌లో కారు డ్రైవర్‌గా పనిచేస్తున్న మహమ్మద్ గౌస్, వాచ్‌మెన్ కుమార్తె అయిన సదరు బాలికను పైఅంతస్తులోకి తీసుకెళ్లి లైంగిక దాడికి యత్నించాడు. బాలిక ప్రతిఘటిస్తూ కేకలు వేయడంతో, నిందితుడు ఆమెను భవనం పైనుంచి కిందకు తోసేశాడు. మొదట ఇది ప్రమాదవశాత్తు జరిగిన ఘటనగా భావించిన కుటుంబ సభ్యులు, బాలిక స్పృహలోకి వచ్చిన తర్వాత అసలు విషయం చెప్పడంతో దిగ్భ్రాంతికి గురయ్యారు. ఈ ఘటనపై ఖమ్మం పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి, 24 గంటల్లోనే నిందితుడిని అరెస్ట్ చేశారు. ప్రస్తుతం బాలిక ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని, ఆమె ఆహారం తీసుకుంటోందని నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్ దేవరాజ్ వెల్లడించారు. గురువారం నిమ్స్‌లో చికిత్స పొందుతున్న బాలికను బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు పరామర్శించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ పాలనలో ప్రతిరోజూ 5 నుంచి 6 పోక్సో కేసులు నమోదవుతున్నాయని ఆయన ఆరోపించారు. బాధితురాలికి ప్రభుత్వం తక్షణమే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని, మెరుగైన వైద్యాన్ని పూర్తిగా ఉచితంగా అందించాలని డిమాండ్ చేశారు. నిమ్స్‌లో మందులు ఉచితంగా లభించడం లేదని, పేద కుటుంబానికి చెందిన బాధితులు వాటిని బయట కొనాల్సి వస్తోందని ఆయన విమర్శించారు.

## టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదల

హైదరాబాద్, జూన్ 12 (ఈవార్తలు): తెలంగాణలోని ఎంబీఏ, ఎంసీఏ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించిన టీజీ ఐసెట్-2026 ఫలితాలు విడుదలయ్యాయి. శుక్రవారం మధ్యాహ్నం 3:30 గంటలకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డి ఇతర ఉన్నతాధికారులతో కలిసి ఈ ఫలితాలను విడుదల చేశారు. ఫలితాలతో పాటు అభ్యర్థుల ర్యాంకు కార్డులను కూడా అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు. నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో మే 13, 14 తేదీల్లో ఈ కంప్యూటర్ ఆధారిత ప్రవేశ పరీక్షను నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 56,000 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకున్నారు. పరీక్ష అనంతరం మే 29న ప్రాథమిక కీని విడుదల చేసిన అధికారులు, తాజాగా తుది ఫలితాలను ప్రకటించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్, రిజిస్ట్రేషన్ నంబర్ మరియు పుట్టిన తేదీ వివరాలను అధికారిక వెబ్‌సైట్‌లో నమోదు చేసి ర్యాంకు కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఈ ర్యాంకు కార్డులో సెక్షన్ల వారీగా సాధించిన మార్కులు, మొత్తం నార్మలైజ్డ్ స్కోర్, ర్యాంకు వివరాలను పొందుపరిచారు. జూలై నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ జరగనుంది.

# ముంబై ఖర్చులు భరించలేను

**హైదరాబాద్‌కు వెళ్లేందుకు అనుమతివ్వండి**

**బాంబే హైకోర్టును ఆశ్రయించిన వరవరరావు**

ముంబై: భీమా కోరేగావ్-ఎల్గార్ పరిషత్ కేసులో నిందితుడైన ప్రముఖ విప్లవ కవి, వరవరరావు దాఖలు చేసిన పిటిషన్‌పై బాంబే హైకోర్టు శుక్రవారం విచారణ చేపట్టింది. తన నివాసాన్ని ముంబై నుంచి హైదరాబాద్‌కు మార్చుకునేందుకు అనుమతించాలని కోరుతూ ఆయన ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై రెండు వారాల్లోగా స్పందన తెలియజేయాలని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ)ను ఆదేశిస్తూ న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అజయ్ గడ్కరీ, జస్టిస్ కమల్ ఖాతాలతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌ను విచారించింది. ముంబైలో నివాసం ఉండటం ఆర్థికంగా పెనుభారంగా మారిందని, వృద్ధాప్యంలో ఇక్కడి జీవన వ్యయాన్ని భరించలేకపోతున్నానని వరవరరావు తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తన నెలవారీ పింఛను సుమారు రూ. 50,000 ఉండగా, ముంబైలో జీవన వ్యయం రూ. 77,000 దాటుతోందని, ఇది తనకు భారంగా మారిందని ఆయన వివరించారు. భీమా కోరేగావ్ కేసులో బెయిల్ పొందిన వరవరరావు, కోర్టు అనుమతి లేకుండా గ్రేటర్ ముంబై పరిధిని దాటి వెళ్లరాదన్న షరతుపై ప్రస్తుతం అక్కడే నివసిస్తున్నారు. ఇదే అభ్యర్థనతో ఆయన గతంలో ఎన్ఐఏ ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా, ఈ ఏడాది మార్చి 16న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. సుప్రీంకోర్టు విధించిన బెయిల్ షరతులను సవరించే అధికారం తమకు లేదని ప్రత్యేక కోర్టు స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. 2018 ఆగస్టులో అరెస్టయిన వరవరరావుకు, ఆరోగ్యం క్షీణించడంతో 2021లో బాంబే హైకోర్టు మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. అనంతరం 2022లో సుప్రీంకోర్టు వైద్య కారణాలతో ఆయన బెయిల్‌ను ఖరారు చేసింది. తాజాగా ఎన్ఐఏ తన ప్రత్యుత్తరాన్ని దాఖలు చేసిన తర్వాత ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ జరగనుంది.

# బెంగాల్‌కు టాటాను తిరిగి తీసుకొస్తాం

**సువేందు అధికారి ప్రకటన**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్‌లో పారిశ్రామిక పెట్టుబడులను తిరిగి పట్టాలెక్కించే పెట్టే దిశగా నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి కీలక ప్రకటన చేశారు. సుమారు రెండు దశాబ్దాల క్రితం రాష్ట్రం నుంచి తరలివెళ్లిన టాటా గ్రూప్‌ను మళ్లీ వెనక్కి తీసుకొస్తామని ఆయన స్పష్టం చేశారు. శుక్రవారం కోల్‌కత్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, “టాటాలను మేము తిరిగి బెంగాల్‌కు తీసుకువస్తాం” అని ప్రకటించారు. సుమారు 18 ఏళ్ల క్రితం సింగూర్‌లో టాటా నానో కార్ల ఫ్యాక్టరీ ఏర్పాటుపై తలెత్తిన వివాదం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. నాటి వామపక్ష ప్రభుత్వం చేపట్టిన భూసేకరణను వ్యతిరేకిస్తూ అప్పటి ప్రతిపక్ష నేత మమతా బెనర్జీ నేతృత్వంలో భారీ ఎత్తున ఉద్యమం జరిగింది. ఈ ఆందోళనల కారణంగా టాటా మోటార్స్ తన ప్రాజెక్టును గుజరాత్‌కు తరలించగా, ఈ పరిణామం బెంగాల్ పారిశ్రామిక రంగంపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ఈ నేపథ్యంలో సువేందు అధికారి చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. బలవంతపు భూసేకరణతో వామపక్ష ప్రభుత్వం, కేవలం ప్రచారానికే పరిమితమైన పరిశ్రమలతో తృణమూల్ కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమయ్యాయని ఆయన విమర్శించారు. తమ బీజేపీ ప్రభుత్వం అవినీతికి, మధ్యవర్తులకు తావులేకుండా పారదర్శక విధానాలతో పారిశ్రామిక ప్రగతికి బాటలు వేస్తుందని ఆయన హామీ ఇచ్చారు. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. 2026 అసెంబ్లీ ఎన్నికలలో ఘన విజయం సాధించిన బీజేపీ, 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించిన విషయం విదితమే. గడిచిన మే నెలలో ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన సువేందు అధికారి, రాష్ట్ర పారిశ్రామిక పునరుజ్జీవనాన్ని ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యతగా ప్రకటించారు.

# జూలై 1 నుంచి టాటా కార్లు పిరం

**గరిష్ఠంగా 1.5 శాతం వరకు పెంపు.. అన్ని మోడళ్లకు వర్తింపు**

ముంబై: దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటార్స్ తన ప్రయాణికుల వాహనాల ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. జులై 1 నుంచి కొత్త ధరలు అమల్లోకి రానున్నాయి. గరిష్ఠంగా 1.5 శాతం వరకు ధరల్ని పెంచుతున్నట్లు కంపెనీ వెల్లడించింది. ఈ పెంపు ఐసీఈ మోడళ్లతో పాటు ఎలక్ట్రిక్ వాహనాలకూ వర్తించనుంది. పెరుగుతున్న ముడి పదార్థాల వ్యయం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్ల కారణంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు సంస్థ తెలిపింది. ఉత్పత్తి వ్యయాలు గణనీయంగా పెరుగుతున్నప్పటికీ వాటిలో పెద్ద భాగాన్ని తామే భరిస్తున్నామని, అయితే కొంత భారాన్ని వినియోగదారులపై మోపక తప్పడం లేదని కంపెనీ పేర్కొంది. ధరల పెంపు అన్ని మోడళ్లపై ఒకేలా ఉండదని తెలిపింది. వాహనం, వేరియంట్‌ను బట్టి మారుతుందని స్పష్టం చేసింది. ఇటీవల ఆటోమొబైల్ రంగంలో ధరల పెంపులు సాధారణంగా మారాయి. గత నెలలో హ్యుందాయ్ కూడా తన వాహనాల ధరలను రూ.12,800 వరకు పెంచింది. ముడి పదార్థాల ధరలు, కమొడిటీ ఖర్చులు, నిర్వహణ వ్యయాలు పెరగడమే కారణమని తెలిపింది. అలాగే మారుతి సుజుకి జూన్ నుంచి వివిధ మోడళ్లపై రూ.30,000 వరకు ధరలు పెంచగా మహీంద్రా కూడా ఈ ఏడాది ప్రారంభంలోనే తన ఎస్‌యూవీలు, కమర్షియల్ వాహనాల ధరలను సవరించింది. టాటా మోటార్స్ ధరల పెంపు ప్రకటన అనంతరం కంపెనీ షేర్లు కూడా మార్కెట్లో స్వల్ప లాభాలతో ట్రేడ్ అయ్యాయి. వాహన తయారీ సంస్థలు ఒకవైపు లాభదాయకతను కాపాడుకుంటూనే మరోవైపు కొత్త ఉత్పత్తులు, సాంకేతికతలపై పెట్టుబడులు కొనసాగించేందుకు ధరల సవరణల మార్గాన్ని ఎంచుకుంటున్నట్లు పరిశ్రమ వర్గాలు పేర్కొంటున్నాయి.

# మేం కాదు.. ఇరానే దాడి చేసింది: ట్రంప్

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై సంచలన ఆరోపణలు చేశారు. హర్మూజ్ జలసంధి గుండా ప్రయాణిస్తున్న భారత నౌకలపై దాడులకు పాల్పడింది ఇరాన్ అని ఆయన ధ్వజమెత్తారు. ఇరాన్ డ్రోన్లతో దాడులు చేసిందని తెలిపారు. అదేవిధంగా, ఇరు దేశాల మధ్య సాగుతున్న శాంతి చర్చల నిబంధనల విషయంలో ఇరాన్ అసత్యాలు ప్రచారం చేస్తోందని ఆయన మండిపడ్డారు. శుక్రవారం తన సోషల్ మీడియా వేదిక ‘ట్రూత్ సోషల్’ ద్వారా ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. “గత రాత్రి హర్మూజ్ జలసంధిలో భారత నౌకలపై ఇరాన్ జరిపిన డ్రోన్ దాడులు ఎంతమాత్రం ఆమోదయోగ్యం కాదు” అని ఆయన తన పోస్టులో పేర్కొన్నారు. అయితే, ఏ నౌకపై జరిగిన దాడి గురించి మాట్లాడుతున్నారో, మాట్లాడుతున్నారో, అందుకు తగిన ఆధారాలేమిటనే అంశాలను ట్రంప్ స్పష్టంగా పేర్కొనలేదు. ప్రస్తుతం ఇరాన్ నుంచి ఈ ఆరోపణలపై ఎటువంటి స్పందన రాలేదు. శాంతి చర్చలకు సంబంధించి ఇరాన్ వెల్లడిస్తున్న సమాచారానికి, వాస్తవ ఒప్పందాలకు పొంతన లేదని ట్రంప్ ఆరోపించారు. గత కొంతకాలంగా హర్మూజ్ జలసంధి కేంద్రంగా అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న సంగతి తెలిసిందే.


## కొల్లూరు మూకాంబిక అమ్మవారికి విజయ్ వెండి కత్తి

ఉడుపి: తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ శుక్రవారం నాడు కర్ణాటకలోని ఉడుపి జిల్లాలో వెలసిన ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొల్లూరు మూకాంబికా ఆలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆయన, తన మొక్కులో భాగంగా 1.6 కిలోల బరువున్న వెండి ఖడ్గాన్ని కానుకగా సమర్పించారు. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ తరపున విజయం సాధించి, మే నెలలో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత విజయ్ రాష్ట్రం వెలుపల పర్యటించడం ఇదే తొలిసారి. ఢిల్లీ నుంచి విమానంలో మంగళూరు అంతర్జాతీయ విమానాశ్రయానికి చేరుకున్న ఆయన, అక్కడి నుంచి రోడ్డు మార్గంలో సుమారు 125 కిలోమీటర్ల దూరంలోని ఆలయానికి చేరుకున్నారు. సంప్రదాయ వస్త్రధారణలో వచ్చిన విజయ్‌కు ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు.

# సురక్షిత దేశాల్లో భారత్ 127

**గత ఏడాదితో పోలిస్తే 12 స్థానాలు పతనం**

**అత్యంత శాంతియుత దేశంగా ఐస్‌లాండ్**



ప్రపంచ శాంతి సూచీ (గ్లోబల్ పీస్ ఇండెక్స్) 2026లో భారత్ ర్యాంకు గణనీయంగా క్షీణించింది. మొత్తం 163 దేశాలతో రూపొందించిన ఈ జాబితాలో భారత్ 127వ స్థానానికి పరిమితమైంది. ఇన్‌స్టిట్యూట్ ఫర్ ఎకనామిక్స్ అండ్ పీస్ విడుదల చేసిన నివేదిక ప్రకారం, ఐస్‌ల్యాండ్ వరుసగా 18వ సంవత్సరం కూడా ప్రపంచంలోనే అత్యంత శాంతియుత దేశంగా తన అగ్రస్థానాన్ని సుస్థిరం చేసుకుంది.

**నివేదిక ప్రకారం, ప్రపంచంలోని సురక్షితమైన దేశాల జాబితాలో గతేడాది 115వ ర్యాంకులో ఉన్న భారత్, ఈసారి 12 స్థానాలు దిగజారి 127వ స్థానానికి పడిపోయింది.**

న్యూఢిల్లీ: దేశంలో కొనసాగుతున్న అంతర్గత ఘర్షణలు, పొరుగు దేశాలతో నెలకొన్న ఉద్రిక్త సంబంధాలు, మణిపూర్‌లో జాతి హింస వంటి అంశాలు భారత్ ర్యాంకు క్షీణించడానికి ప్రధాన కారణాలని నివేదిక పేర్కొంది. ముఖ్యంగా ‘కొనసాగుతున్న సంఘర్షణల’ విభాగంలో భారత్ స్కోరు 9.2 శాతం మేర తగ్గడం గమనార్హం. మరోవైపు, అత్యల్ప నేరాల రేటు, పటిష్ఠమైన సామాజిక భద్రత వంటి సానుకూల అంశాలతో ఐస్‌లాండ్ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఐస్‌లాండ్ తర్వాత స్థానాల్లో న్యూజిలాండ్, స్విట్జర్లాండ్, స్లోవేనియా, ఐర్లాండ్, ఆస్ట్రియా, పోర్చుగల్, సింగపూర్, ఫిన్లాండ్, జపాన్ దేశాలు టాప్-10లో చోటు దక్కించుకున్నాయి. మన పొరుగున ఉన్న దక్షిణాసియా దేశాల్లో నేపాల్ 111, బంగ్లాదేశ్ 117, పాకిస్థాన్ 152వ స్థానాల్లో నిలిచాయి. గత 18 ఏళ్ల కాలంలో ప్రపంచవ్యాప్తంగా శాంతియుత వాతావరణం క్షీణించడం ఇది 15వ సారి అని నివేదిక స్పష్టం చేసింది. ప్రధానంగా ప్రపంచవ్యాప్తంగా సాయుధ పోరాటాలు పెరగడమే ఈ ప్రతికూల స్థితికి ప్రధాన కారణంగా నిలుస్తోందని నివేదిక విశ్లేషించింది.

# పరిశ్రమలకు బంకుల పెట్రోల్ బంద్

**బల్క్ డిపోల నుంచే ఇంధనం కొనాలి.. 90 రోజుల పాటు అమల్లో ఆంక్షలు.. కేంద్ర ప్రభుత్వం కీలక ఆదేశాలు జారీ**

న్యూఢిల్లీ: దేశంలో పెట్రోల్, డీజిల్ సరఫరాపై కేంద్ర ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు, పెద్ద కంపెనీలు ఇకపై పెట్రోల్ బంకుల నుంచి పెద్ద మొత్తంలో ఇంధనం కొనుగోలు చేయకుండా ఆంక్షలు విధించింది. ఈ మేరకు పెట్రోలియం శాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో డీజిల్‌కు అసాధారణంగా డిమాండ్ పెరిగినట్లు ప్రభుత్వం గుర్తించింది. బల్క్ వినియోగదారులకు విక్రయించే డీజిల్ ధర, సాధారణ పెట్రోల్ బంకుల్లోని ధర కంటే ఎక్కువగా ఉండటంతో అనేక సంస్థలు బంకుల నుంచే భారీగా కొనుగోళ్లు చేస్తున్నాయి. దీంతో సాధారణ వినియోగదారులకు సరఫరా సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కేంద్రం భావించింది. ఢిల్లీలో ప్రస్తుతం లీటర్ డీజిల్ ధర పెట్రోల్ బంకులో రూ.95.20గా ఉంది. అదే బల్క్ కొనుగోలుదారులకు ఈ ధర రూ.134.50గా ఉంది. ఈ తేడా కారణంగా పరిశ్రమలు, వాణిజ్య సంస్థలు బల్క్ డిపోల బదులు బంకుల వైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రభుత్వం తెలిపింది. పశ్చిమాసియా ఉద్రిక్తతల ప్రభావంతో అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరా వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని గుర్తుచేసింది. షిప్పింగ్ వ్యవస్థ కూడా ప్రభావితమవడంతో దేశీయంగా ఇంధన లభ్యతపై ప్రభావం పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలోనే తాజా ఆంక్షలు తీసుకొచ్చింది. మరోవైపు ‘పెట్రోలియం అండ్ ఎక్స్‌ప్లోసివ్స్ సేఫ్టీ ఆర్గనైజేషన్’ (పీఈఎస్ఓ) అనుమతి పొందిన కంటైనర్లకు మాత్రమే డీజిల్ విక్రయించాలి. ఒక వినియోగదారు లేదా ఒక వాహనానికి రోజుకు గరిష్ఠంగా 200 లీటర్ల వరకు మాత్రమే డీజిల్ ఇవ్వాలని ఆదేశించారు. దీన్ని మళ్లీ విక్రయించడం పూర్తిగా నిషేధం. నిల్వ చేయడం, బ్లాక్ మార్కెటింగ్, అనధికారిక కొనుగోళ్లు, ఇంధన మళ్లింపుపై రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ ఆంక్షలు మొదట 90 రోజుల పాటు అమల్లో ఉంటాయి. అవసరమైతే మరో ఉత్తర్వుతో గడువును పొడిగించే అవకాశం ఉంది. దేశవ్యాప్తంగా సాధారణ వినియోగదారులకు ఇంధన కొరత తలెత్తకుండా చూడటమే ఈ నిర్ణయం లక్ష్యమని కేంద్రం వెల్లడించింది.




# టీవీ, రేడియో ప్రసారాలకు కొత్త రూల్స్

**ఏకీకృత విధానం దిశగా కేంద్రం అడుగులు**

**కొత్త ముసాయిదా నియమాలు విడుదల**

**ప్రజాభిప్రాయ సేకరణకు జులై 27 వరకు గడువు**



న్యూఢిల్లీ: దేశంలోని టెలివిజన్, రేడియో ప్రసార రంగంలో భారీ సంస్కరణలకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న అనేక మార్గదర్శకాలను ఒకే గొడుగు కిందకి తీసుకొస్తూ ‘టెలికమ్యూనికేషన్స్ (టెలివిజన్, రేడియో, అనుబంధ సేవలు) రూల్స్, 2026’ పేరుతో ముసాయిదా నియమావళిని విడుదల చేసింది. కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. కొత్త టెలికమ్యూనికేషన్స్ చట్టం-2023కు అనుగుణంగా ఈ మార్పులు చేపట్టినట్లు తెలిపింది. ఈ కొత్త ముసాయిదా నిబంధనలతో ప్రసార పరిశ్రమకు ఏకీకృత, అత్యంత సరళీకృత నియమావళి అందుబాటులోకి వస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. టీవీ, రేడియో ప్రసార రంగంలో వ్యాపార సరళీకరణను (ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్) ప్రోత్సహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యమని స్పష్టం చేసింది. ఈ కొత్త నియమావళి అమల్లోకి వస్తే, ప్రస్తుతం ఉన్న అనేక పాత గైడ్‌లైన్స్ రద్దవుతాయి. కొత్త ముసాయిదాలో పలు కీలక సంస్కరణలను ప్రతిపాదించారు. అన్ని రకాల అనుమతుల ప్రక్రియను డిజిటల్ రూపంలోకి మార్చనున్నారు. అనుమతుల కోసం గతంలో తప్పనిసరిగా ఉన్న ‘గ్రాంట్ ఆఫ్ పర్మిషన్ అగ్రిమెంట్’ (జీఓపీఏ) పద్ధతిని తొలగించారు. దీనివల్ల విధానాలు మరింత సులభతరం కానున్నాయి. ఏదైనా వివాదాలు తలెత్తితే వాటి పరిష్కారం కోసం పారదర్శక యంత్రాంగాన్ని కూడా ఏర్పాటు చేయనున్నారు. ఈ మార్పులన్నీ ప్రసార రంగంలో వ్యాపారాన్ని సులభతరం చేస్తాయని కేంద్రం విశ్వాసం వ్యక్తం చేసింది. ఈ ముసాయిదా నియమావళిని సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్‌లో ప్రజలు, ఇతర మంత్రిత్వ శాఖల సంప్రదింపుల కోసం అందుబాటులో ఉంచినట్టు అధికారులు తెలిపారు. దీనిపై సూచనలు, సలహాలు, లేదా అభిప్రాయాలను జూలై 27వ తేదీలోగా మంత్రిత్వ శాఖలోని అండర్ సెక్రటరీ (బీపీ అండ్ ఎల్)కి పంపాలని కోరారు.

**ఒకే గొడుగు కిందకి రానున్న సేవలు:**

- శాటిలైట్ టెలివిజన్ ఛానళ్ల అప్ లింకింగ్, డౌన్ లింకింగ్ మార్గదర్శకాలు.
- డైరెక్ట్-టు-హోమ్ (డీటీహెచ్) బ్రాడ్‌కాస్టింగ్ సేవల లైసెన్సింగ్ విధానాలు.
- హెడ్ఎండ్-ఇన్-ది-స్కై (హెచ్ఐటీఎస్) ప్రసార సేవల మార్గదర్శకాలు.
- ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా ఎఫ్ఎం రేడియో సేవల విస్తరణ (ఫేజ్-3) విధానాలు.
- కమ్యూనిటీ రేడియో స్టేషన్ల ఏర్పాటుకు సంబంధించిన మార్గదర్శకాలు.

# ‘అఖండ’ కాంగ్రెస్?



**కాంగ్రెస్‌లో టీఎంసీ, ఎన్సీపీ-ఎస్పీ విలీనం?**



న్యూఢిల్లీ: దేశ రాజకీయాల్లో మరో కీలక పరిణామానికి వేదిక సిద్ధమవుతోందా? ఒకప్పుడు కాంగ్రెస్ నుంచి విడిపోయి ప్రాంతీయ పార్టీలను స్థాపించిన నేతలు మళ్లీ అదే గూటికి చేరబోతున్నారా? ఈ ప్రశ్నలే ప్రస్తుతం జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్‌లో నెలకొన్న అంతర్గత సంక్షోభం, ఇటీవల జరిగిన వరుస రాజకీయ భేటీల నేపథ్యంలో ఈ ఊహాగానాలు మరింత ఊపందుకున్నాయి. ఈ అంశంపై ఎన్‌డీటీవీ తాజాగా ఓ ఆసక్తికర కథనాన్ని ప్రచురించింది. తృణమూల్ కాంగ్రెస్ తమ పార్టీలో విలీనం కానుందనే ప్రచారాన్ని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఇప్పటికే ఖండించినప్పటికీ మహారాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేత నానా పటోలే చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో కొత్త చర్చకు దారితీశాయి. కాంగ్రెస్ భావజాలానికి దగ్గరగా ఉన్న పార్టీలు మళ్లీ ఒక్కటయ్యే దిశగా ఆలోచిస్తున్నాయని, శరద్ పవార్, మమతా బెనర్జీ కూడా ఆ దిశగా అడుగులు వేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఇది కేవలం పొత్తు కాదని, విలీనం స్థాయిలో చర్చలు జరుగుతున్నాయని చెప్పడం మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఇటీవల శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్ కూడా కాంగ్రెస్ నుంచి విడిపోయిన చిన్న పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో కలవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ కూడా ఇదే తరహా వ్యాఖ్యలు చేశారు. ప్రాంతీయ పార్టీలన్నీ తిరిగి కాంగ్రెస్‌లో చేరి రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చాలని సూచించారు. అయితే ఈ వ్యాఖ్యలను ఆయా పార్టీలు అధికారికంగా సమర్థించలేదు. శరద్ పవార్ కుమార్తె సుప్రియా సూలే మాత్రం “సమయం వచ్చినప్పుడు చూద్దాం” అని అన్నారు. ఈ ఊహాగానాలకు ప్రధాన కారణం ఇటీవల ఢిల్లీలో జరిగిన రాజకీయ భేటీలే. ఇండియా కూటమి సమావేశం సందర్భంగా మమతా బెనర్జీ, అభిషేక్ బెనర్జీలు వరుసగా సోనియా, రాహుల్ గాంధీతో సమావేశమయ్యారు. ముఖ్యంగా అభిషేక్-రాహుల్ సమావేశం గంటన్నరపాటు సాగడం రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది. అయితే కాంగ్రెస్ వర్గాలు మాత్రం విలీనం అంశంపై తమ నుంచి ఎలాంటి ప్రయత్నాలు లేవని, అలాంటి ప్రతిపాదన వస్తే అది తృణమూల్ కాంగ్రెస్ నుంచే రావాల్సి ఉంటుందని స్పష్టం చేస్తున్నాయి. దీంతో విలీనం చర్చలు వాస్తవ రూపం దాలుస్తాయా? లేక రాజకీయ ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది రానున్న రోజుల్లో తేలనుంది.

# స్టాక్ మార్కెట్లు రయ్ రయ్

**1,695 పాయింట్లు లాభపడి**

**75,527 వద్ద ముగిసిన సెన్సెక్స్**

ముంబై: అమెరికా, ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం కుదరవచ్చనే సానుకూల సంకేతాలతో శుక్రవారం భారత స్టాక్ మార్కెట్లు భారీగా లాభపడ్డాయి. ఇన్వెస్టర్లు పెద్ద ఎత్తున కొనుగోళ్లకు దిగడంతో సెన్సెక్స్ ఓ దశలో 1,700 పాయింట్లకు పైగా దూసుకెళ్లగా, నిఫ్టీ తిరిగి 23,600 మార్కును అధిగమించింది. మార్కెట్లలో నెలకొన్న ఈ ఉత్సాహంతో ఇన్వెస్టర్ల సంపద భారీగా పెరిగింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, బీఎస్ఈ సెన్సెక్స్ 1,695.40 పాయింట్లు (2.30%) లాభపడి 75,527.95 వద్ద స్థిరపడింది. అదేవిధంగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 461.30 పాయింట్లు (1.99%) వృద్ధి చెంది 23,622.90 వద్ద ముగిసింది. ఇరాన్‌తో గొప్ప ఒప్పందం కుదిరిందని, పత్రాల ఖరారు మాత్రమే మిగిలి ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రపంచ మార్కెట్లలో కొత్త ఉత్సాహాన్ని నింపాయి. భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు తగ్గితే ఇంధన సరఫరాలు స్థిరపడతాయనే ఆశతో పెట్టుబడులు వెల్లువెత్తాయి. ఈ ర్యాలీలో దాదాపు అన్ని రంగాల షేర్లు రాణించాయి. ముఖ్యంగా నిఫ్టీ రియల్టీ, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు 3 శాతానికి పైగా లాభపడ్డాయి. శ్రీరామ్ ఫైనాన్స్, బజాజ్ ఫైనాన్స్, లార్సెన్ అండ్ టూబ్రో షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్లుగా నిలిచాయి. అయితే, నిఫ్టీ ఐటీ రంగం మాత్రం మిగిలిన రంగాలతో పోలిస్తే వెనుకబడింది. టెక్నికల్ పరంగా చూస్తే, నిఫ్టీ 23,800 స్థాయిని దాటితే 24,000 వైపు పయనించవచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. 23,550-23,500 ప్రాంతం కీలక మద్దతుగా పనిచేస్తుందని విశ్లేషకులు తెలిపారు.

# టార్గెటెడ్ హత్యలకు దావూద్ గ్యాంగ్ స్కెచ్

**ఉత్తరాదిన షార్ప్‌షూటర్ల నియామకం.. హెచ్చరించిన ఐబీ**

న్యూఢిల్లీ: భారత్‌లో అశాంతిని రేకెత్తించేందుకు అండర్ వరల్డ్ డాన్ దావూద్ ఇబ్రహీంకు చెందిన డి-కంపెనీ మరో భారీ కుట్రకు తెరలేపినట్లు భారత నిఘా వర్గాలు హెచ్చరించాయి. దేశవ్యాప్తంగా వరుసగా ‘టార్గెట్ కిల్లింగ్స్’ చేసేందుకు ఉత్తర భారతదేశం సహా ఇతర ప్రాంతాల నుంచి షార్ప్‌షూటర్లను ఈ ముఠా రిక్రూట్ చేసుకుంటున్నట్లు ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) అధికారులు వెల్లడించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ ముఠా ప్రముఖులను కాకుండా, స్థానికంగా పలుకుబడి కలిగిన సామాన్య పౌరులనే లక్ష్యంగా చేసుకుంటోంది. వరుస హత్యల ద్వారా ప్రజల్లో నిరంతర అభద్రతా భావాన్ని, భయాందోళనలను కలిగించడమే వీరి ప్రధాన వ్యూహంగా కనిపిస్తోంది. ఎవరినైనా లక్ష్యంగా చేసుకోవచ్చనే హెచ్చరికలను పంపి, స్థానికంగా తీవ్ర గందరగోళం సృష్టించాలని వారు యత్నిస్తున్నారు. ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్, యూపీ ఏటీఎస్, ఎన్ఐఏ సంయుక్తంగా దావూద్‌కు చెందిన ఉగ్రవాద ముఠాను ఛేదించిన కొద్ది రోజులకే ఈ కొత్త కుట్ర వెలుగులోకి రావడం గమనార్హం. పాకిస్థాన్ నుంచి దావూద్ ప్రధాన అనుచరుడు మున్నా జింగాడా (సయ్యద్ ముజాకిర్ ముద్దసర్ హుస్సేన్) ఈ కొత్త నెట్‌వర్క్‌ను పర్యవేక్షిస్తున్నట్లు దర్యాప్తు ఏజెన్సీలు అనుమానిస్తున్నాయి.

# భారత ఎగుమతులు డబుల్

## 12 ఏళ్లలో రెట్టింపు స్థాయికి చేరిక.. ప్రపంచ మార్కెట్‌లో తెలంగాణకు అవకాశం.. కేంద్ర వాణిజ్య శాఖ సదస్సులో వక్తలు



హైదరాబాద్, జూన్ 12 (పీఐబీ): గత 12 ఏళ్ల కాలంలో భారత ఎగుమతులు రెట్టింపు స్థాయికి చేరాయని కేంద్ర ఆర్థిక సలహాదారు ప్రియా పీ నాయర్ అన్నారు. కేంద్ర వాణిజ్య శాఖ, ఏపీఈడీఏ భాగస్వామ్యంతో శుక్రవారం హైదరాబాద్‌లో 'గత 12 ఏళ్లలో భారత ఎగుమతుల వృద్ధి ప్రస్థానం'పై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న ప్రియా పీ నాయర్ మాట్లాడుతూ.. 2013-14లో 468 బిలియన్ డాలర్లుగా ఉన్న దేశ మొత్తం వస్తు, సేవల ఎగుమతులు 2025-26 నాటికి 860 బిలియన్ డాలర్లను దాటాయని తెలిపారు. విధాన సంస్కరణలు, కొత్త మార్కెట్ల అన్వేషణ, డిజిటల్ వ్యాపార సదుపాయాలు, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల ఈ పురోగతి సాధ్యమైందని చెప్పారు. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా, వ్యవసాయ ఉత్పత్తులు, సుగంధ ద్రవ్యాలు, దుస్తులు, సముద్ర ఉత్పత్తులు వంటి రంగాలు ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధిని నమోదు చేశాయని తెలిపారు. ట్రేడ్ కనెక్ట్ వంటి డిజిటల్ వేదికలు, ఎంఎస్ఎంఈలకు అందిస్తున్న ప్రత్యేక మద్దతు అంతర్జాతీయ వ్యాపారాన్ని సులభతరం చేశాయని వివరించారు. తెలంగాణ వాణిజ్య శాఖ కార్యదర్శి ఎన్ భవానిశ్రీ మాట్లాడుతూ దేశంలో ఉత్పత్తి అవుతున్న సుగంధ ద్రవ్యాల్లో కేవలం 13 శాతం మాత్రమే ఎగుమతి అవుతున్నందున ఈ రంగంలో అపార అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. తెలంగాణలోని ప్రత్యేక ఆర్థిక మండళ్లు ఫార్మా, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ తయారీ రంగాలకు కీలక కేంద్రాలుగా ఎదుగుతున్నాయని చెప్పారు. ఫార్మెక్సిల్ ప్రతినిధులు భారత ఔషధ ఉత్పత్తులు ప్రస్తుతం 190కి పైగా దేశాలకు చేరుతున్నాయని వెల్లడించగా, ఏపీఈడీఏ అధికారులు బాస్మతీయేతర బియ్యం, బేకరీ ఉత్పత్తులు, బంగినపల్లి మామిడి ఎగుమతుల్లో తెలంగాణ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈసీజీసీ, డీజీఎఫ్‌టీ అధికారులు ఎగుమతిదారులకు అందుబాటులో ఉన్న క్రెడిట్ ఇన్సూరెన్స్, డిజిటల్ సేవలు, ఎఫ్‌టీఏల ప్రయోజనాలు, ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ సంస్థలతో సమన్వయం పెంచుకుని నాణ్యతా ప్రమాణాలు, ధ్రువీకరణలకు ప్రాధాన్యం




ఇస్తే తెలంగాణ నుంచి ఎగుమతులను మరింత పెంచే అవకాశం ఉందని సమావేశంలో వక్తలు అభిప్రాయపడ్డారు. సదస్సులో ఫార్మెక్సిల్ డైరెక్టర్ జనరల్ కె. రాజా భాను, ఏపీఈడీఏ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ ఆర్పీ నాయుడు, ఈసీజీసీ ప్రతినిధి సురేశ్ బాబు, అడిషనల్ డైరెక్టర్ జనరల్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(డీజీఎఫ్‌టీ) డాక్టర్ సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

**సదస్సులో వక్తలు పేర్కొన్న కీలకాంశాలు:**

- 12 ఏళ్లలో భారత ఎగుమతులు 468 బిలియన్ డాలర్ల నుంచి 860 బిలియన్ డాలర్లకు పెరుగుదల.
- విధాన సంస్కరణలు, డిజిటల్ ట్రేడ్, ఎఫ్‌టీఏలు ఎగుమతుల వృద్ధికి కీలకం.
- సుగంధ ద్రవ్యాల్లో కేవలం 13% మాత్రమే ఎగుమతి అవుతుండటంతో భారీ అవకాశాలు.
- తెలంగాణ సెజ్‌లు ఫార్మా, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ తయారీకి ప్రధాన కేంద్రాలు.
- భారత ఔషధ ఉత్పత్తులు 190కి పైగా దేశాలకు ఎగుమతి.
- బాస్మతియేతర బియ్యం, బేకరీ ఉత్పత్తులు, బంగినపల్లి మామిడి ఎగుమతుల్లో తెలంగాణ కీలక పాత్ర.
- ఎంఎస్ఎంఈలు ప్రభుత్వ పథకాలు, డిజిటల్ సేవలు, క్రెడిట్ ఇన్సూరెన్స్‌ను వినియోగించుకోవాలని పిలుపు.
- నాణ్యత ప్రమాణాలు, ధ్రువీకరణలు పెంచితే తెలంగాణకు ప్రపంచ మార్కెట్లలో మరింత వృద్ధి అవకాశాలు.



## పిల్లల చేతికి పుస్తకాలు

**బాల కార్మిక నిర్మూలన మనందరి బాధ్యత.. న్యాయమూర్తి యేగి జానకి**

ఎండపల్లి, జూన్ 12 (ఈవార్తలు): బాల కార్మిక వ్యవస్థ సమాజానికి శాపమని, ప్రతి చిన్నారి విద్యను అభ్యసించి ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాన్ని కల్పించడం అందరి బాధ్యత అని న్యాయమూర్తి యేగి జానకి అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఎండపల్లి మండలం కొత్తపేట గ్రామంలో లీగల్ ఎయిడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పిల్లల చేతిలో పుస్తకాలు ఉండాలే తప్ప పనిముట్లు కాదని పేర్కొన్నారు. పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపాలని, బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, అధికారులు, సమాజం కీలక పాత్ర పోషించాలని సూచించారు. బాల కార్మిక నిర్మూలనకు ప్రజల్లో మరింత అవగాహన పెరగాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిరెడ్డి మహేందర్ రెడ్డి, సీఐ రాం నర్సింహారెడ్డి, ఎస్ఐ ఉదయ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బందేల రమేష్, జనరల్ సెక్రటరీ రామడుగు రాజేష్, లీగల్ ఎయిడ్ కౌన్సిల్ జాజాల రమేష్, న్యాయవాది కలమడుగు హరి ప్రసాద్, గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## నిరుపేద యువతి పెళ్లికి ఆర్థిక సాయం

**రూ.10 వేల చెక్కు అందజేసిన తుడి లచ్చన్న**

బోయిన్‌పల్లి, జూన్ 12 (ఈవార్తలు): కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని బోయిన్‌పల్లి మండల కేంద్రానికి చెందిన నిరుపేద కుటుంబ యువతి బొడ్డు ఖుషి వివాహానికి తుడి లచ్చన్న ఆర్థిక సహాయం అందించారు. బొడ్డు దుర్గయ్య కుమార్తె ఖుషి వివాహం ఈ నెల 18న జరగనున్న నేపథ్యంలో కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకుని వారి నివాసానికి వెళ్లి రూ.10 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తుడి లచ్చన్న మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు అండగా నిలవడం తన ధ్యేయమని తెలిపారు. భవిష్యత్తులో కూడా అవసరమైన వారికి తన వంతు సహకారం అందిస్తానని, ఈ కుటుంబానికి కూడా అండగా ఉంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నల్ల మోహన్, గ్రామ యువకులు, టీఎల్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.



## సర్‌పై బీఎల్‌ఏలకు అవగాహన

**అర్హుల ఓట్లు తొలగిపోకుండా చూడాలి .. జువ్వాడి నర్సింగరావు**

కోరుట్ల, జూన్ 12 (ఈవార్తలు): ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై బూత్ లెవల్ ఏజెంట్లు (బీఎల్‌ఏలు) అప్రమత్తంగా ఉండి అర్హుల ఓట్లు రద్దు కాకుండా చూడాలని తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్, కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం కోరుట్ల పట్టణంలోని కావేరి గార్డెన్‌లో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) అవగాహన శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐఆర్ పరిశీలకుడు రుద్ర సంతోష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జువ్వాడి కృష్ణారావు హాజరై బీఎల్‌ఏలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఏలకు ప్రత్యేక సమగ్ర సవరణ కిట్లను అందజేశారు. గతంలో పలు రాష్ట్రాల్లో నిర్వహించిన సవరణ ప్రక్రియలో లక్షలాది ఓట్లు తొలగిపోయిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితులు తలెత్తకుండా బీఎల్‌ఏలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. అనంతరం రుద్ర సంతోష్ లైవ్ డెమో ద్వారా ఎస్ఐఆర్ విధానాన్ని వివరించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజంగి నందయ్య, పీసీసీ జాయింట్ సెక్రటరీ బండ శంకర్, మెట్‌పల్లి పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు రైసోద్దీన్, మండల అధ్యక్షుడు పన్నాల అంజిరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ తిరుమల వసంత గంగాధర్, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# 400 సిమెంట్ కుండీల గల్లంతు?

**నిల్వ చేశారా? కాసుల కోసం నొక్కేశారా?**

**జగిత్యాలలో పచ్చదనం ప్రాజెక్టుపై ప్రజల్లో ప్రశ్నలు**

**మున్సిపల్ అధికారులు స్పందించాలని డిమాండ్**




జగిత్యాల బ్యూరో, జూన్ 12 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ ప్రగతి నిధుల వినియోగంపై జగిత్యాల మున్సిపాలిటీలో మరోసారి చర్చకు దారితీసిన అంశం వెలుగులోకి వచ్చింది. పచ్చదనం, పరిశుభ్రత, పట్టణ అభివృద్ధి లక్ష్యాల పేరుతో చేపట్టిన కార్యక్రమాల్లో ప్రజాధనం వినియోగంపై స్థానికంగా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. సమాచారం ప్రకారం, పట్టణ ప్రగతి నిధుల నుంచి సుమారు రూ. 8 లక్షలు వెచ్చించి 1000 సిమెంట్ కుండీలు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. వీటిలో సుమారు 600 కుండీల్లో మొక్కలు నాటి యావార్ రోడ్డు, రాజీవ్ బైపాస్ రోడ్డులపై ఏర్పాటు చేసినట్లు సమాచారం. అయితే, మిగిలిన 400 కుండీల పరిస్థితిపై స్పష్టత లేకపోవడం అనుమానాలకు దారితీస్తోంది. అవి ఎక్కడికి వెళ్లాయి? నిల్వలో ఉన్నాయా? లేక ఇతర ప్రదేశాలకు తరలించబడ్డాయా? అనే అంశాలపై అధికారిక వివరణ అవసరమని స్థానికులు కోరుతున్నారు. ఇక ఇప్పటికే ఏర్పాటు చేసిన మొక్కల సంరక్షణపై కూడా విమర్శలు వినిపిస్తున్నాయి. నిత్య నిర్వహణ, నీరుపోసే వ్యవస్థ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుల ప్రారంభ సమయంలో హడావుడి, ఫోటో కార్యక్రమాలు మాత్రమే జరుగుతున్నాయని, అనంతరం సంరక్షణపై నిర్లక్ష్యం కనిపిస్తోందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. రోడ్లపై ఏర్పాటు చేసిన కుండీలు సరైన నిర్వహణ లేకుండా ఉండటంతో కొన్ని కుండీలు దెబ్బతిన్నట్లు, మరికొన్ని నిరుపయోగంగా మారినట్లు తెలుస్తోంది. దీనితో ప్రజాధనం వినియోగంపై పారదర్శకత అవసరమని స్థానికంగా చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో, మొత్తం కుండీల వినియోగం, మొక్కల సంరక్షణ చర్యలు, నిధుల ఖర్చు వివరాలపై మున్సిపల్ అధికారులు స్పష్టత ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజాధనం వినియోగంలో బాధ్యతాయుతమైన నిర్వహణ అవసరమని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# 60 కుట్టుమిషన్లు దగ్ధం

**షార్ట్‌సర్క్యూట్‌తో కాలిపోయిన ఇల్లు**

**రూ.8 లక్షల ఆస్తి నష్టం**



జగిత్యాల టౌన్, జూన్ 12 (ఈవార్తలు): జగిత్యాల పట్టణంలోని 41వ వార్డులో మార్కెట్ వెనుక ప్రాంతంలో గురువారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా భారీ అగ్నిప్రమాదం సంభవించింది. గంగాధర్ అనే కుట్టు మిషన్ల వ్యాపారికి చెందిన గూనెపెంకులతో నిర్మించిన ఇల్లు మంటల్లో పూర్తిగా దగ్ధమైంది. సమయానికి ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. అయితే మంటలు వేగంగా వ్యాపించి ఇంట్లో ఉన్న సామగ్రి, వస్తువులతో పాటు సుమారు 60 కొత్త కుట్టు మిషన్లు అగ్నికి ఆహుతయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లినట్లు బాధితుడు తెలిపాడు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. కళ్లముందే తమ జీవనాధారం అగ్నికి ఆహుతి కావడంతో గంగాధర్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. స్థానికులు, ప్రజాప్రతినిధులు బాధిత కుటుంబానికి ప్రభుత్వం, అధికారులు తక్షణ సాయం అందించాలని కోరుతున్నారు.



## కొండగట్టు అంజన్న సేవలో జడ్జి అనిల్ కుమార్ జాదవ్

మల్యాల, జూన్ 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానాన్ని వేములవాడ సీనియర్ సివిల్ జడ్జి అనిల్ కుమార్ జాదవ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం అర్చకులు వేద మంత్రోచ్ఛారణల మధ్య ఆశీర్వచనాలు అందించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## టీసీఎస్ ఉద్యోగి ఆత్మహత్య

**ఇద్దరు మహిళా సహోద్యోగులపై కేసు**

**వేధింపులే కారణమని సూసైడ్ నోట్‌లో ఆరోపణ**

పుణే: ప్రముఖ ఐటీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్)లో పనిచేస్తున్న ఒక ఉద్యోగి ఆత్మహత్యకు పాల్పడటం పుణేలో సంచలనం సృష్టించింది. సహోద్యోగుల వేధింపుల వల్లే తాను ఈ తీవ్ర నిర్ణయం తీసుకుంటున్నట్లు మృతుడు రాసిన సూసైడ్ నోట్ ఆధారంగా పోలీసులు ఇద్దరు మహిళా ఉద్యోగులతో సహా ముగ్గురిపై కేసు నమోదు చేశారు. టీసీఎస్ హింజేవాడి కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న అమిత్ అభయ్ బ్రహ్మే (48) జూన్ 2న భోసరిలోని తన నివాసంలో ఉరివేసుకుని ప్రాణాలు విడిచారు. ఆయన కుమారుడు అనీష్ బ్రహ్మే (19) జూన్ 9న పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ విషాద ఘటన వెలుగులోకి వచ్చింది. ఘటనా స్థలం నుంచి పోలీసులు ఆత్మహత్యకు గల కారణాలను వివరిస్తూ అమిత్ రాసిన లేఖను స్వాధీనం చేసుకున్నారు. ఆ లేఖలో తన సహోద్యోగినులు అర్చన, శశ్వతి తనను అందరి ముందు పదేపదే అవమానించారని అమిత్ ఆవేదన వ్యక్తం చేశారు. తనకు నైపుణ్యం లేని ప్రాజెక్టులను అప్పగించడం, పనితీరు సరిగా లేదని బహిరంగంగా మందలించడంతో పాటు ఉద్యోగానికి రాజీనామా చేయాలని తీవ్రంగా ఒత్తిడి చేసినట్లు పేర్కొన్నారు.

## ఎంట్రీ ఇచ్చిన ఎల్‌నినో

**పసిఫిక్‌లో అధికారికంగా ప్రారంభం**

**రాబోయే రోజుల్లో తీవ్రరూపం**

న్యూఢిల్లీ: భారత వర్షాకాలాన్ని ప్రభావితం చేసే కీలక వాతావరణ పరిణామమైన ఎల్‌నినో మళ్లీ పసిఫిక్ మహాసముద్రంలో ఏర్పడిందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ప్రకటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న నైరుతి రుతుపవనాల కాలంలో ఈ ప్రభావం మరింత బలపడే అవకాశం ఉందని హెచ్చరించింది. దీంతో దేశవ్యాప్తంగా వర్షపాతం, వ్యవసాయం, నీటి లభ్యతపై ప్రతికూల ప్రభావం పడనుందనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఐఎండీ విడుదల చేసిన తాజా నివేదిక ప్రకారం భూమధ్యరేఖా పసిఫిక్ ప్రాంతంలో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయిని మించి పెరగడంతో ఎల్‌నినో పరిస్థితులు అధికారికంగా ప్రారంభమయ్యాయి. వాతావరణ వ్యవస్థల్లో కూడా ఈ మార్పుల ప్రభావం కనిపించడం ప్రారంభమైందని తెలిపింది. రాబోయే నెలల్లో ఈ పరిస్థితులు మరింత తీవ్రరూపం దాల్చే అవకాశముందని అంచనా వేసింది. పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు ప్రాంతాల్లో సముద్ర జలాలు అసాధారణంగా వేడెక్కే సహజ వాతావరణ ప్రక్రియే ఎల్‌నినో. భారతదేశంలో ఇది అత్యంత కీలకమైన అంశంగా పరిగణిస్తారు. ఎందుకంటే గతంలో ఎల్‌నినో ప్రభావం ఉన్న సంవత్సరాల్లో సాధారణ కంటే తక్కువ వర్షపాతం నమోదవడం, వ్యవసాయ ఉత్పత్తి తగ్గడం వంటి పరిస్థితులు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావానికి గురయ్యే అత్యంత సున్నితంగా ఉన్న 197 జిల్లాలను గుర్తించామన్నారు. వాటి కోసం రాష్ట్రాలవారీగా ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. ప్రతి వారం పరిస్థితిని సమీక్షిస్తున్నామని, అవసరమైన విత్తనాలు, వ్యవసాయ సామగ్రిని ముందుగానే నిల్వ చేశామని వెల్లడించారు. రైతుల్లో అవగాహన పెంచేందుకు 'ఖేత్ బచావో అభియాన్' పేరుతో దేశవ్యాప్త కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు తెలిపారు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు సాధారణ సగటు వర్షపాతం కంటే సుమారు 90 శాతం మాత్రమే నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ ఇప్పటికే అంచనా వేసింది.

## ఫీజు బకాయిలు వెంటనే విడుదల చేయాలి: దావ వసంత



జగిత్యాల, జూన్ 12 (ఈవార్తలు): రాష్ట్రంలోని పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత విద్యకు అండగా నిలిచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, పెండింగ్‌లో ఉన్న బకాయిలను వెంటనే విడుదల చేయాలని జగిత్యాల జిల్లా పరిషత్ తొలి చైర్‌పర్సన్, బీఆర్ఎస్ నాయకురాలు దావ వసంత సురేష్ డిమాండ్ చేశారు. వేలాది మంది విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల కోసం ఎదురుచూస్తున్నప్పటికీ ప్రభుత్వం స్పందించకపోవడం ఆందోళనకరమని ఆమె పేర్కొన్నారు. బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు కళాశాలల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొందరు విద్యను కొనసాగించలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను క్రమం తప్పకుండా విడుదల చేశామని గుర్తుచేసిన ఆమె, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎన్నికల హామీలను అమలు చేస్తూ పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేసి విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని కోరారు. లేనిపక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



## సింగరేణిని నిర్వీర్యం చేసే కుట్రలు: కొప్పుల

రామగుండం, జూన్ 12 (ఈవార్తలు): సింగరేణి సంస్థను నామరూపాలు లేకుండా చేయాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం వరుస కుంభకోణాలకు తెరలేపుతోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. రామగుండం ఆర్జీ-1, ఓసీపీ-5లో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి బొగ్గు నిల్వలను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. సింగరేణి వెబ్‌సైట్‌లో రాష్ట్రవ్యాప్తంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందన్నారు. ఆర్జీ-1, ఓసీపీ-5లో లక్షల టన్నుల బొగ్గు నిల్వ ఉందని చెబుతున్నా, అక్కడ మట్టి, రాళ్ల కుప్పలను బొగ్గుగా చూపించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అక్కడ 50 వేల మెట్రిక్ టన్నుల బొగ్గు కూడా కనిపించడం లేదన్నారు. ఓబీ కాంట్రాక్టులు, సోలార్ పవర్ ప్లాంట్లు, డెటోనేటర్ కొనుగోళ్లు, పవర్ ప్రాజెక్టుల వ్యవహారాల్లో అవినీతి చోటుచేసుకుంటోందని విమర్శించారు. సింగరేణి కార్మికుల జీవితాలతో ప్రభుత్వం చెలగాటం ఆడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. బొగ్గు నిల్వల అంశంపై సీబీఐ విచారణ జరిపించాలని, లేని నిల్వలను ఎలా చూపిస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సింగరేణి ప్రజల ఆస్తి అని, దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.

## పారా ఎస్ఎఫ్‌కు మల్యాల యువకుడి ఎంపిక



మల్యాల, జూన్ 12 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలానికి చెందిన యువకుడు సంఘ ఆదర్శ్ భారత సైన్యంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన పారా కమాండో స్పెషల్ ఫోర్స్‌కు ఎంపికయ్యాడు. ఇటీవల అగ్నివీర్‌గా ఎంపికైన సైనికులలో నిర్వహించిన కఠినమైన ఎంపిక ప్రక్రియలో ఆదర్శ్ తన ప్రతిభను చాటుకున్నారు. ఈ ఎంపిక కోసం మొత్తం 130 మంది అభ్యర్థులకు వివిధ రకాల శారీరక, మానసిక పరీక్షలు నిర్వహించగా, కేవలం 17 మంది మాత్రమే అర్హత సాధించారు. ఆ ఎంపికైన వారిలో సంఘ ఆదర్శ్ ఒకడిగా నిలిచాడు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆదర్శ్ చిన్ననాటి నుంచే దేశసేవ పట్ల ఆసక్తి పెంచుకుని కఠోర శ్రమ, క్రమశిక్షణతో శిక్షణ పొందాడు. దేశ రక్షణలో కీలక పాత్ర పోషించే పారా స్పెషల్ ఫోర్స్‌లోకి ఎంపికైన తొలి మల్యాల వాసిగా ఆదర్శ్ గుర్తింపు పొందడంతో గ్రామ ప్రజలు, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలియజేశారు.


లయ్యారి చిత్రం





## ప్రైమ్‌లో కరుప్పు స్ట్రీమింగ్

కోలీవుడ్ స్టార్ హీరో సూర్య తాజాగా నటించిన చిత్రం కరుప్పు. తెలుగులో వీరభద్రుడు పేరిట రిలీజ్ చేశారు. థియేటర్లలో మంచి పాజిటివ్ టాక్ తెచ్చుకొని రూ.305 కోట్లకు పైగా కలెక్షన్లు వసూలు చేసి సంచలనం సృష్టించిన ఈ సినిమా ఇప్పుడు సైలెంట్ గా ఓటీటీలోకి వచ్చేసింది. ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో శుక్రవారం నుంచి తెలుగు, తమిళ్ భాషల్లో డిజిటల్ స్ట్రీమింగ్ అవుతోంది. ఆర్ జె బాలాజీ దర్శకత్వంలో త్రిష - సూర్య ప్రధాన పాత్రల్లో వచ్చిన ఫాంటసీ, యాక్షన్ థ్రిల్లర్ థియేటర్లలో ప్రేక్షకులను బాగా ఆకట్టుకొని ఇప్పుడు డిజిటల్ ప్లాట్ఫారం వేదికగా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయింది . మరి ఈ సినిమా ఈ ఓటీటీలో ఎలాంటి రికార్డ్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



## 'సింగ'గా గోపీచంద్

హీరో గోపీచంద్ త్వరలో ఓ ప్రతిష్టాత్మక యాక్షన్ ఎంటర్‌టైనర్‌తో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నాడు. ఈ మూవీతో ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి వెంకట్ దర్శకుడిగా పరిచయం కాబోతుండగా.. 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. తాజాగా గోపీచంద్ పుట్టినరోజు కావడంతో.. ఆ సందర్భంగా సినిమా టైటిల్‌తో పాటు ఫస్ట్ లుక్ పోస్టర్‌ను కూడా షేర్ చేశారు మేకర్స్. పక్షుల కిలకిలారావాలతో ప్రారంభమయ్యే ఈ టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులను దట్టమైన అడవి మధ్యలోకి తీసుకెళ్తుంది. చీకటిలో మెరుస్తున్న రెండు కళ్లను చూపిస్తూ.. వెంటనే గోపీచంద్‌ను రివీల్ చేస్తూ మేకర్స్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. కళ్లలో ఆగ్రహం, చేతిలో గొడ్డలి, ప్రతీకారంతో రగిలిపోతున్న పాంథర్‌లా కనిపిస్తున్న ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. అలాగే దీనికి 'సింగ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను రివీల్ చేశారు. ఈ గ్లింప్స్ గోపీచంద్ ట్రాన్స్‌ఫర్మేషన్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంది. యాక్షన్, ఎమోషన్, డ్రామా కలగలిపిన పవర్ ఫుల్ కథతో ఈ చిత్రం తెరకెక్కబోతుండగా.. ఇందులో మలయాళ నటి అనార్కలి నజర్ (మొదటి పరిచయం) హీరోయిన్‌గా నటిస్తున్నారు.



## ప్రస్తుతానికి తల్లి పాత్రే

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కత్రినా కైఫ్.. పెళ్లి, వ్యక్తిగత జీవితానికి ప్రాధాన్యం ఇస్తూ సినిమాలకు దూరం అయింది. ఈ క్రమంలోనే ఈ అమ్మడు మళ్లీ వెండితెరకు ఇవ్వబోతున్నట్లు గత కొద్ది రోజులుగా ఓ వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆమె పలువురు దర్శకనిర్మాతలు చెబుతున్న కథలు వింటుందని, ఈసారి కేవలం కమర్షియల్ సినిమాలకే పరిమితం కాకుండా పాత్రకు ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టులు ఎంపిక చేసుకుని స్ట్రాంగ్ ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధం అవుతున్నది పలు పోస్టులు హల్ చల్ చేస్తున్నాయి. అంతే కాకుండా.. వెబ్ సిరీస్‌లు, డిజిటల్ ఒరిజినల్స్, మహిళా ప్రధాన కథలపై ఆమె ప్రత్యేక ఆసక్తి చూపుతున్నదని, ఇప్పటికే కొన్ని కథలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని బాలీవుడు వర్గాల నుంచి వార్తలు రాగా.. ఆమె ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఈ క్రమంలోనే కత్రినా రీ ఎంట్రీపై తాజాగా టీమ్ స్పందించి క్లారిటీ ఇచ్చింది. ఈ మేరకు 'కత్రినా కైఫ్ మళ్లీ సినిమాల్లోకి వస్తుంది అని సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు. ఆమె తన ప్రాధాన్య ప్రస్తుతం మదర్‌హుడ్‌కే పరిమితం చేశారు. ఓటీటీ ఆఫర్ల వార్తల్లో కూడా ఎలాంటి నిజం లేదు. అవన్నీ పుకార్లు మాత్రమే. ఆమె సిల్వర్ స్క్రీన్‌కు ఎంట్రీ ఇవ్వడానికి ఇంకాస్త టైమ్ ఉంది' అంటూ తెలిపారు.

## సోషల్ మీడియా క్రేజ్ ఇక్కడ పనికిరాదు



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే గత కొద్ది కాలంగా సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోలింగ్‌ను ఎదుర్కొంటోంది. ఆమె వరుసగా పెద్ద పెద్ద సినిమాలు చేస్తున్నప్పటికీ, బాక్సాఫీస్ దగ్గర ఆశించిన విజయాలు అందడం లేదు. ఇక ఇటీవల వచ్చిన హిందీ సినిమా హై జవానీ ఇష్క్ హోనా హై' కూడా పెద్దగా హిట్ అందుకోలేకపోయింది. దీంతో కొందరు నెటిజన్లు ఆమెను ఐరన్ లెగ్ అంటూ దారుణంగా ట్రోల్ చేయడం ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ నెగెటివిటీపై మౌనంగా ఉన్న పూజా హెగ్డే, తాజాగా, ఈ విషయంపై ఘాటుగా రియాక్ట్ అయ్యింది. సోషల్ మీడియా క్రేజ్‌కు, సినిమా కలెక్షన్లకు అస్సలు సంబంధం ఉండదని స్పష్టం చేసింది. "నాకు సోషల్ మీడియాలో 30 మిలియన్ల కంటే ఎక్కువ మంది ఫాలోవర్లు ఉన్నారు. అంత మాత్రాన సినిమా థియేటర్లలో 30 కోట్ల టికెట్లు అమ్ముడవుతాయని గ్యారెంటీ లేదు. సోషల్ మీడియా ఫాలోయింగ్ అనేది కేవలం ఒక నంబర్ మాత్రమే. అది సినిమాల సక్సెస్‌ను డిసైడ్ చేయలేదు" అని పూజా తేల్చి చెప్పింది. ఇండస్ట్రీలోని అసలైన స్టార్‌డమ్ గురించి చెబుతూ.. "సినిమా పరిశ్రమలో కొంతమంది నటులకు సోషల్ మీడియాలో కేవలం 5 మిలియన్ల మంది ఫాలోవర్లు మాత్రమే ఉంటారు.

## జాన్వీ కాస్త తగ్గితే బెటర్

బాలీవుడ్ నుంచి టాలీవుడ్ కు వచ్చిన జాన్వీ కపూర్ వరుసగా భారీ ప్రాజెక్టులనే ఎంచుకుంటోంది. దేవర, పెద్ది అంటూ ఇప్పటికే పాన్ ఇండియా సినిమాలతో ఇక్కడ తన మార్క్ చూపించే ప్రయత్నం చేసింది. అయితే భారీ బడ్జెట్ సినిమాలు, కమర్షియల్ రోల్స్ తో పాటు నటిగా తనను తాను ప్రూవ్ చేసుకునే కథల మీద కూడా ఆమె దృష్టి పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎందుకంటే కేవలం స్టార్ హీరోల పక్కన చేస్తే వచ్చే ఇమేజ్ కంటే నటనకు ఆస్కారం ఉన్న పాత్రలు చేస్తే వచ్చే గుర్తింపు చాలా కాలం నిలబడుతుంది.





## కేఏ-13లో దేవికా భట్

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం వైవిధ్యమైన కథలను ఎంచుకుంటూ టాలెంటెడ్ నటుడిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నాడు. ఇప్పుడు ఆయన తన కెరీర్‌లో మరో పెద్ద మైలురాయిని అందుకోబోతున్నాడు. నటుడిగానే కాకుండా మొదటిసారిగా తానే దర్శకుడిగా మారి ఒక క్రేజీ సినిమాను తెరకెక్కిస్తుండటం విశేషం. కేఏ-13 అనే వర్కింగ్ టైటిల్‌తో రాబోతున్న ఈ చిత్రానికి సంబంధించిన పూజా కార్యక్రమాలు, షూటింగ్ ఈరోజు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా 'ఇచ్చట అన్ని రకాల ఎంటర్‌టైన్‌మెంట్ వండబడును' అనే ఆసక్తికరమైన క్యాప్షన్‌తో చిత్రబృందం ఒక పోస్టర్‌ను విడుదల చేసి సినిమాపై అంచనాలను పెంచేసింది. పూర్తి ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాత చాగంటి సుధాకర్ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. మాస్ అండ్ క్లాస్ మెలోడీల కింగ్ భీమ్స్ సిసిరోలియో ఈ సినిమాకు సంగీతం అందిస్తున్నారు.



## మెగా 158లో నివేదా పేతురాజ్

వైవిధ్యమైన పాత్రలతో, నటనతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి నివేదా పేతురాజ్.. లవ్, బ్రేకప్ తర్వాత మళ్లీ కెరీర్‌పై ఫోకస్ పెట్టింది. తన సెకండ్ ఇన్నింగ్స్‌లో భాగంగా స్టార్ హీరోల సినిమాల్లో చాన్స్‌లు అందుకుంటున్నట్లు వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే మెగాస్టార్ చిరంజీవి కొత్త ప్రాజెక్టులో ఈ అమ్మడు భాగం అయినట్లు వార్తలు వచ్చాయి. తాజాగా నెట్టింట వైరల్ అవుతున్న వార్తలను నిజం చేస్తూ టీమ్ అధికారింగా ప్రకటించింది. ప్రస్తుతం 'మెగా 158' అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతోన్న ఈ సినిమాకు బాబీ కొల్లి దర్శకత్వం వహిస్తుండగా.. తాజాగా సెకండ్ షెడ్యూల్ పొల్లాచిలో కంప్లీట్ చేసుకున్నట్లు టీమ్ ప్రకటించారు. ఈ సందర్భంగా నివేదా బర్త్‌డే కావడంతో షూటింగ్ సెట్‌లోనే కేక్ కట్ చేసి.. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు పంచుకోగా అవి కాస్త వైరల్‌గా మారాయి. దీంతో మెగా 158లో నివేదా భాగం అయినట్లు అఫీషియల్ అనౌన్స్‌మెంట్ వచ్చేసినట్లు అయింది.



# కేన్ మామ గుడ్‌బై!

## అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు

న్యూజిలాండ్ మాజీ కెప్టెన్ కేన్ విలియమ్సన్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 16 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌కు ముగింపు పలికాడు. న్యూజిలాండ్ తరపున అత్యంత విజయవంతమైన కెప్టెన్‌గా.. బ్యాటర్‌గా గుర్తింపు పొందిన కేన్ విలియమ్సన్.. శుక్రవారం తన నిర్ణయాన్ని అధికారికంగా ప్రకటించాడు.

**రిటైర్మెంట్‌కు ఇదే సరైన సమయమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ప్రకటనలో పేర్కొన్నాడు. 'రిటైర్మెంట్ గురించి గత కొంతకాలంగా ఆలోచిస్తున్నాను. ఇదే సరైన సమయమని భావించి నిర్ణయం తీసుకున్నాను.**

అంతర్జాతీయ క్రికెట్ ఆడాలనే బలమైన ఆకాంక్ష నాకు ఎప్పుడూ ఉండేది. న్యూజిలాండ్ తరఫున ప్రతి మ్యాచ్‌లో నా సాయశక్తులా శ్రమించాను. స్వతహాగా ఆట నుంచి తప్పుకోవడం అదృష్టంగా భావిస్తున్నా. నాకు ఎంతో ఇష్టమైన క్రికెట్‌లో సుదీర్ఘకాలం కొనసాగడం అదృష్టంగా భావిస్తున్నా.'అని కేన్ విలియమ్సన్ పేర్కొన్నాడు. సన్‌రైజర్స్ హైదరాబాద్ మాజీ కెప్టెన్‌గా కేన్ విలియమ్సన్ తెలుగు అభిమానులకు సుపరిచితం. అతన్ని తెలుగు ఫ్యాన్స్ ముద్దుగా కేన్ మామ అని పిలుస్తుంటారు. కేన్ మామ రిటైర్మెంట్ నిర్ణయంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. విలియమ్సన్ తన కెరీర్‌లో 378 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడి 48.12 సగటుతో 19,346 పరుగులు సాధించాడు. న్యూజిలాండ్ క్రికెట్ చరిత్రలోనే అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా గుర్తింపు పొందాడు. 2019 వన్డే ప్రపంచ కప్‌లో ప్లేయర్ ఆఫ్ ది టోర్నీగా నిలిచిన కేన్ మామ.. ఐసీసీ టెస్ట్ ప్లేయర్ ఆఫ్ ది ఇయర్ అవార్డును కూడా గెలుచుకున్నాడు. కేన్ విలియమ్సన్ సారథ్యంలో న్యూజిలాండ్ అద్భుతమైన విజయాలను అందుకుంది. కేన్ సారథ్యంలోనే న్యూజిలాండ్ ఐసీసీ వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షి 2021ను కైవసం చేసుకుంది. 2019 వన్డే ప్రపంచ కప్ ఫైనల్లో బౌండరీ రూల్ అనే అసంబద్ధమైన రూల్‌తో న్యూజిలాండ్ టైటిల్ కోల్పోయినా.. కేన్ మామ ముఖంలో చిరునవ్వు చెరగలేదు. ఏ ఒక్కర్ని అతను నిందించలేదు. కేన్ సారథ్యంలో 2016 టీ20 ప్రపంచ కప్ సెమీఫైనల్స్ చేరిన న్యూజిలాండ్.. 2021 టీ20 ప్రపంచ కప్‌లో రన్నరప్‌గా నిలవడంతో పాటు 2022 టీ20 ప్రపంచ కప్, 2023 వన్డే ప్రపంచ కప్‌ల్లో సెమీస్ చేరింది. టెస్ట్ క్రికెట్‌లో కేన్ విలియమ్సన్ 40 మ్యాచ్‌ల్లో న్యూజిలాండ్‌కు సారథ్యం వహించి 22 విజయాలు అందించాడు. వన్డేల్లో 91 మ్యాచ్‌ల్లో 46 విజయాలు, టీ20ల్లో 75 మ్యాచ్‌ల్లో 35 విజయాలు నమోదు చేశాడు. టీ20ల్లో అత్యధిక విజయాలు అందించిన న్యూజిలాండ్ కెప్టెన్‌గా నిలిచాడు. క్రీడాస్ఫూర్తికి కేన్ విలియమ్సన్ నిలువెత్తు నిదర్శనమని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. తన 16 ఏళ్ల కెరీర్‌లో కేన్ విలియమ్సన్ ఎప్పుడూ మైదానంలో అనుచితంగా ప్రవర్తించలేదు. క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరించలేదు. ఇప్పటికే కోచ్‌గా రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కేన్ మామ.. పూర్తిస్థాయి కోచ్‌గా కొనసాగే అవకాశం ఉంది.

### మన ప్రయాణం అద్భుతం: కోహ్లీ

విలియమ్సన్ వీడ్కోలు వార్తపై భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ సోషల్ మీడియా వేదికగా భావోద్వేగంగా స్పందించాడు. "మైదానంలో ప్రత్యర్థి నుంచి వ్యక్తిగత జీవితంలో మంచి స్నేహితుడిగా మారిన మన ప్రయాణం అద్భుతం. నీతో కలిసి ఆడటం, నీ బ్యాటింగ్‌ను వీక్షించడం ఎంతో ఆనందాన్నిచ్చింది. ఆటతో పాటు ఇతర అంశాలపై మన మధ్య ఉన్న స్నేహానికి, అభిప్రాయాలకు నేను ఎంతో విలువ ఇస్తాను. నీకు అంతా మంచే జరగాలి సోదరా. ఇక నువ్వు విశ్రాంతి తీసుకోవాల్సిన సమయం వచ్చింది, నిజమైన జీవితం ఇప్పుడే మొదలైంది మిత్రమా" అని కోహ్లీ పేర్కొన్నాడు.




# దక్షిణ కొరియా గ్రాండ్ విన్

### చెకియాపై సూపర్ విక్టరీ



ఫిఫా ప్రపంచ కప్‌లో ఆసియా జట్టు దక్షిణ కొరియా శుభారంభం చేసింది. చెకియాపై 2-1 తేడాతో విజయం సాధించింది. గ్రూప్-ఏలో తలపడిన ఇరు జట్లు గెలుపు కోసం చివరివరకూ పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట రసవత్తరంగా మారింది. రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడిస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది. మరికాసేపటికే సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లు శ్రమించాయి. 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 2-1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. చెకియా 16 పొరపాట్లు చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.



# టొరొంటోలో నోరా హంగామా!

ఫిఫా ప్రపంచకప్ ప్రారంభ వేడుకల్లో భాగంగా కెనడాలోని టొరొంటో నగరంలో జరిగిన అట్టహాసమైన ప్రారంభ కార్యక్రమంలో తన ప్రదర్శనతో ప్రేక్షకులను అలరించారు. ప్రపంచవ్యాప్తంగా అభిమానులను ఆకట్టుకునేలా రూపొందించిన అధికారిక ఫిఫా గీతం సిర్ సిర్‌ను ఆమె తొలిసారిగా ప్రత్యక్షంగా ప్రదర్శించారు. మొరాకోలో ప్రసిద్ధి చెందిన ఫుట్‌బాల్ నినాదం సిర్ సిర్ నుంచి శీర్షికను తీసుకొని రూపొందించిన ఆ పాటను..మొరాకన్ దరిజా, అరబిక్, ఫ్రెంచ్, ఇంగ్లీష్ భాషల మేళవింపుతో బహుళ సాంస్కృతిక భావజాలాన్ని ప్రతిబింబించే ప్రయత్నం చేశారు. కెనడాలోని టొరొంటోలో మొరాకో కుటుంబంలో జన్మించిన నోరా ఫతేహీ, అక్కడే పెరిగి అనంతరం భారతీయ సినీ పరిశ్రమలో అవకాశాల కోసం భారత్‌కు వచ్చారు. బాలీవుడ్‌లో ప్రముఖ నృత్య కళాకారిణిగా, నటిగా గుర్తింపు పొందిన ఆమె, ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై కూడా తన ముద్ర వేస్తున్నారు. ఇప్పటికే 2022లో జరిగిన ఫిఫా ప్రపంచకప్ ముగింపు వేడుకల్లో ప్రదర్శన ఇచ్చిన నోరా, ఈసారి స్వస్థలమైన టొరొంటోలో ప్రారంభ వేడుకలకు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. ఈ ప్రదర్శనతో ప్రపంచకప్ సంగీత తారల జాబితాలో ఆమె పేరు మరింత బలంగా నిలిచింది.




# బంగ్లాదే కప్పు

### ఆస్ట్రేలియాపై చారిత్రక విజయం

### 2-1తో సిరీస్ కైవసం.. ఆస్పత్రి పాలైన బంగ్లా కెప్టెన్

వన్డే క్రికెట్‌లో బంగ్లాదేశ్ సరికొత్త చరిత్రను సృష్టించింది. సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో మూడు వన్డేల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలి ఉండగానే 2-1తో కైవసం చేసుకుంది. వన్డేల్లో ఆస్ట్రేలియాపై బంగ్లాదేశ్‌కు ఇదే తొలి సిరీస్ విజయం. అయితే ఈ మ్యాచ్ అనంతరం బంగ్లాదేశ్ కెప్టెన్ మెహ్‌దీ హసన్ ఆసుపత్రిపాలయ్యాడు. బంగ్లాదేశ్ బ్యాటింగ్ సందర్భంగా ఆస్ట్రేలియా పేసర్ రైలీ మెరెడిత్ వేసిన 34వ ఓవర్‌లో మెహిదీ హసన్ తీవ్రంగా గాయపడ్డాడు. రైలీ మెరెడిత్ వేసిన బౌన్సర్.. మెహిదీ హసన్ హెల్మెట్ పక్క భాగాన్ని బలంగా తాకింది. దాంతో అతను క్రీజులో కుప్పకూలాడు. బంగ్లాదేశ్ ఫిజియో పెజ్జెతుల్ ఇస్లాం ఖాన్, ఆస్ట్రేలియా వైద్య బృందం హుటాహుటిన పరుగెత్తుకొచ్చారు. అతనికి ప్రథమ చికిత్స అందిస్తుండగా.. మెహిదీ హసన్ మైదానంలోనే వాంతులు చేసుకోవడం తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. ఈ సన్నివేశాలు భయానక పరిస్థితులను కల్పించాయి. అతన్ని ఆసుపత్రికి తీసుకెళ్లడానికి స్ట్రెచర్‌ను మైదానంలోకి తీసుకురాగా.. మెహ్‌దీ హసన్ నిరాకరించాడు. బ్యాటింగ్ చేయగలనని చెప్పి ఫిజియోలను బయటకు పంపించాడు. తీవ్రమైన నొప్పితోనే బ్యాటింగ్ కొనసాగించిన మెహిదీహసన్.. సిక్సర్ కొట్టి బంగ్లాదేశ్‌కు చారిత్రాత్మక విజయాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసిన వెంటనే మెహిదీ హసన్‌ను ఢాకాలోని ఆసుపత్రికి తరలించారు. టీమ్ ఫిజియో మాట్లాడుతూ.. మెహిదీ హసన్‌కు స్వల్ప గాయమే అయ్యిందని, ముందస్తు చర్యల్లో భాగంగానే ఆసుపత్రికి తరలించామని తెలిపాడు. ప్రస్తుతం అతను బాగానే ఉన్నాడని చెప్పాడు. మరో 24 గంటల పాటు వైద్యుల పర్యవేక్షణలో ఉంటాడని తెలిపాడు. మెహిదీ హసన్ ఆసుపత్రికి వెళ్లడంతో నజ్ముల్ హుస్సేన్ షాంటో పోస్ట్ మ్యాచ్ ప్రజెంటేషన్ కార్యక్రమంలో పాల్గొన్నాడు. మెహిదీ హసన్ క్షేమంగా ఉన్నాడని చెప్పిన నజ్ముల్.. ఆస్ట్రేలియాపై వన్డే సిరీస్ గెలవడం వర్ణించలేనిఅనుభూతి అని చెప్పాడు. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 42 ఓవర్లలో 8 వికెట్లకు 187 పరుగులు చేసింది.



# సెమీస్‌కు పీవీ సింధు

భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధు మరోసారి మెరిసింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ సూపర్ 500 టోర్నీలో భారత స్టార్ షట్లర్ పీవీ సింధు అదరగొట్టేసింది. మహిళల సింగిల్స్ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో పీవీ సింధు చైనా క్రీడాకారిణి చెన్ సు యును ఏకపక్ష పోరులో మట్టికరిపించి ఘన విజయంతో సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. ఈ కీలక మ్యాచ్‌లో ఆరంభం నుంచే పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శించిన పీవీ సింధు.. కేవలం 31 నిమిషాల్లోనే 21-6, 21-9 తేడాతో ప్రత్యర్థిని రౌండ్లవారీగా చిత్తు చేసింది. ఈ అద్భుత విజయంతో ఈ ఏడాది తన తొలి టైటిల్‌ను కైవసం చేసుకునేందుకు పీవీ సింధు కేవలం రెండు అడుగుల దూరంలో నిలిచింది. ప్రస్తుత సీజన్లో ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న పీవీ సింధుకు ఈ విజయం ఎంతో ఊరటనిచ్చింది. ఈ ఏడాది ఆడిన 8 బీడబ్ల్యూఎఫ్ టోర్నమెంట్లలో పీవీ సింధుకు ఇది కేవలం రెండో సెమీఫైనల్ కావడం గమనార్హం. గత రౌండ్లో భారత్‌కే చెందిన విజయం సాధించి క్వార్టర్స్‌కు చేరిన పీవీ సింధు.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శనివారం 13-6-2026, జగిత్యాల


నేటి ఈవార్తలు సంపాదకీయం Editorial

# సర్.. తప్పటడుగులకు బెత్తం దెబ్బలు!

భారత ప్రజాస్వామ్యానికి ఎన్నికలు ప్రాణం అయితే, ఓటరు జాబితా దానికి పునాది. ఎంత పారదర్శకంగా ఎన్నికలు నిర్వహించినా, ఓటరు జాబితాలో లోపాలు ఉంటే ప్రజాస్వామ్య విశ్వసనీయత దెబ్బతింటుంది. ఈ నేపథ్యంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ దేశ ఎన్నికల చరిత్రలో ఒక కీలక అధ్యాయంగా నిలుస్తోంది. కాలక్రమేణా జనాభా మార్పులు, వలసలు, మరణాలు, కొత్తగా ఓటు హక్కు పొందిన యువత చేరిక వంటి కారణాల వల్ల ఓటరు జాబితాల్లో తప్పులు సహజంగా ఏర్పడతాయి. ఒకే వ్యక్తికి రెండుచోట్ల పేర్లు ఉండటం, మరణించిన వారి పేర్లు తొలగించకపోవడం, అర్హులైన కొత్త ఓటర్లు జాబితాలో లేకపోవడం వంటి సమస్యలు ఎన్నికల నిష్పక్షపాతతపై ప్రశ్నలు లేవనెత్తుతాయి. ఇలాంటి లోపాలను సమగ్రంగా సరిచేయడమే ఎస్ఐఆర్ లక్ష్యం. ఈ ప్రక్రియ వల్ల ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది. ప్రతి ఓటు నిజమైన అర్హుడి చేతిలోనే ఉండేలా చూడటం ప్రజాస్వామ్యానికి అవసరమైన కనీస బాధ్యత. అదే సమయంలో అక్రమ నమోదులు, నకిలీ ఓటర్లు, డూప్లికేట్ ఎంట్రీలు తగ్గే అవకాశం ఉంటుంది. భవిష్యత్ ఎన్నికలు మరింత పారదర్శకంగా, విశ్వసనీయంగా జరిగేందుకు ఇది బలమైన పునాదిని వేస్తుంది. అయితే ఎస్ఐఆర్ విజయవంతం కావాలంటే కొన్ని జాగ్రత్తలు తప్పనిసరి. నిజమైన ఓటర్లు అనవసరంగా జాబితా నుంచి తొలగించబడకుండా తగిన ఆధారాల పరిశీలన జరగాలి. పేదలు, వలస కార్మికులు, వృద్ధులు, దూర ప్రాంతాల ప్రజలు పత్రాల లేమి కారణంగా ఓటు హక్కును కోల్పోకూడదు. సాంకేతికతతో పాటు మానవీయ దృష్టికోణం కూడా అవసరం. రాజకీయ పక్షాల అభ్యంతరాలను పారదర్శకంగా పరిశీలిస్తూ, ప్రజలకు సరైన అవగాహన కల్పించడం ఎన్నికల యంత్రాంగం బాధ్యత. డిజిటల్ యుగంలో ఆధార్, జనన-మరణ నమోదులు, నివాస సమాచారం వంటి పరిపాలనా డేటాతో సమన్వయం పెంచడం ద్వారా ఓటరు జాబితాల నాణ్యతను మెరుగుపరచవచ్చు. అయితే వ్యక్తిగత గోప్యత, డేటా భద్రత, చట్టపరమైన పరిమితులను కూడా సమానంగా గౌరవించాలి. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కేవలం రాజ్యాంగం ఇచ్చిన అవకాశం మాత్రమే కాదు, ప్రజల సార్వభౌమాధికారానికి ప్రతీక. అందువల్ల ఓటరు జాబితా స్వచ్ఛతను కాపాడే ప్రతి చర్య దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. ఎస్ఐఆర్‌ను రాజకీయ వివాదాల కంటే ఎన్నికల సంస్కరణల దిశగా చూడగలిగితే, అది భారత ఎన్నికల చరిత్రలో ఒక కీలక మైలురాయిగా నిలిచే అవకాశం ఉంది. నిజమైన ఓటరుకు న్యాయం చేయడం, ప్రతి చెల్లుబాటు అయ్యే ఓటు విలువను కాపాడడం, ప్రజల విశ్వాసాన్ని పెంపొందించడం-ఇవే ఎస్ఐఆర్ వంటి సమగ్ర పునర్విమర్శ కార్యక్రమాల అసలు లక్ష్యాలుగా నిలవాలి.



# పశ్చిమ దేశాల తీరు..
## భారత సార్వభౌమత్వానికి సవాల్

అంతర్జాతీయ రాజకీయాల్లో "నియమాల ఆధారిత వ్యవస్థ" గురించి తరచూ మాట్లాడే పశ్చిమ దేశాలు, అదే నియమాలను అన్ని దేశాల విషయంలో ఒకే విధంగా అమలు చేస్తున్నాయా అనే ప్రశ్న తరచూ తలెత్తుతోంది. తమ వ్యూహాత్మక ప్రయోజనాలకు అనుగుణంగా ఒక ప్రమాణం, ఇతర దేశాలకు మరో ప్రమాణం అనుసరించడం అనే విమర్శలు కొత్తవి కావు. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ చేసిన వ్యాఖ్యలు కూడా ఈ చర్చను మరోసారి ముందుకు తెచ్చాయి. భారతదేశం స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అనుసరిస్తూ, తన జాతీయ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకుంటోంది. ఇంధన భద్రత, రక్షణ అవసరాలు, వాణిజ్య సంబంధాలు లేదా భౌగోళిక రాజకీయాల విషయంలో భారత్ తన పరిస్థితులకు అనుగుణంగా వ్యవహరించడం సహజం. అయితే కొన్ని యూరోపియన్ దేశాలు లేదా పశ్చిమ వేదికలు భారత నిర్ణయాలపై బహిరంగ విమర్శలు చేయడం, అదే సమయంలో తమకు అనుకూలమైన సందర్భాల్లో భిన్నమైన ప్రమాణాలను అవలంబించడం ద్వంద్వ వైఖరిగా కనిపిస్తోందని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉదాహరణకు, ప్రపంచంలోని అనేక ఘర్షణల విషయంలో పశ్చిమ దేశాలు తమ వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను ముందుంచుకుని వ్యవహరించిన సందర్భాలు ఉన్నాయి. అదే తరహా స్వేచ్ఛను భారత్ వినియోగించినప్పుడు మాత్రం ప్రశ్నలు లేవనెత్తడం సమానత్వ సూత్రానికి విరుద్ధంగా భావించబడుతోంది. అంతర్జాతీయ సంబంధాల్లో విశ్వసనీయత అనేది ఒకే ప్రమాణాన్ని అందరికీ వర్తింపజేసినప్పుడే పెరుగుతుంది. అయితే ఈ అంశాన్ని భావోద్వేగాల కంటే వాస్తవాల కోణంలో చూడడం అవసరం. యూరప్ ఒకే స్వరంతో మాట్లాడే ఏకరూప రాజకీయ వ్యవస్థ కాదు; వివిధ దేశాలకు భిన్నమైన విదేశాంగ ప్రాధాన్యాలు, భద్రతా ఆందోళనలు, ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయి. అదే సమయంలో భారత్‌కు కూడా తన జాతీయ ప్రయోజనాలను కాపాడుకునే హక్కు ఉంది. పరస్పర గౌరవం, సమానత్వం, సంభాషణల ద్వారానే విభేదాలను పరిష్కరించాలి. నేటి బహుళధ్రువ ప్రపంచంలో భారత్ ఒక ప్రధాన ఆర్థిక, వ్యూహాత్మక శక్తిగా ఎదుగుతోంది. అలాంటి దేశంపై ఒత్తిడి రాజకీయాలు లేదా బోధనా ధోరణి ఫలప్రదం కాదు. భాగస్వామ్య దేశాలు పరస్పర ప్రయోజనాలను గుర్తించి, ఒకరి సార్వభౌమ నిర్ణయాలను మరొకరు గౌరవించినప్పుడే స్థిరమైన సంబంధాలు ఏర్పడతాయి. అంతిమంగా, పశ్చిమ దేశాలు నిజంగా ప్రజాస్వామ్యం, అంతర్జాతీయ న్యాయం, నియమాల ఆధారిత వ్యవస్థను బలపరచాలనుకుంటే, ఆ సూత్రాలను అన్ని దేశాలకు సమానంగా వర్తింపజేయాలి. భారత్ కూడా తన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని కొనసాగిస్తూ, పరస్పర గౌరవం, జాతీయ ప్రయోజనాల సమతుల్యతతో ప్రపంచ వేదికపై తన పాత్రను మరింత బలోపేతం చేసుకోవాలి. ప్రజాస్వామ్య దేశాల మధ్య విభేదాలు సహజమే అయినప్పటికీ, అవి ద్వంద్వ ప్రమాణాల ద్వారా కాకుండా నిష్పాక్షిక సంభాషణ ద్వారా పరిష్కారమవడం అంతర్జాతీయ వ్యవస్థకు మేలు చేస్తుంది.

**- విద్యుల్లత**
**పొలిటికల్ అనలిస్టు, హైదరాబాద్**

# కలలకు రెక్కలు.. ఉపకార వేతనాలు!



"దేశంలోని మారుమూల పల్లెలు, చిన్న పట్టణాల నుంచి ఆక్స్‌ఫర్డ్, జాన్ హాప్కిన్స్ లాంటి విఖ్యాత విశ్వవిద్యాలయ ప్రాంగణాల్లో పరచుకున్న పచ్చని తోటల వరకూ... విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలన్న భారతీయ విద్యార్థుల ఆకాంక్షలకూ, ఆశయాలకూ జాతీయ విదేశీ విద్యా పథకం (ఎన్‌వోఎస్) రెక్కలు తొడుగుతోంది. త్రిపురలోని ఒక మారుమూల, వెనుకబడిన గ్రామానికి చెందిన విద్యార్థి దీపాయన్ భౌమిక్. అంతర్జాతీయ విద్యతో దక్కే అవకాశాలకు ఆమడదూరంలో పెరిగాడు. అయినప్పటికీ, ఎలాగైనా ఆర్కిటెక్ట్ కావాలని కలలుగన్నాడు.



మొత్తానికి చదువుపై తన పట్టుదలకు తోడు, జాతీయ విదేశీ విద్యా పథకం (ఎన్‌వోఎస్) సాయంతో దీపాయన్ కల నెరవేరింది. ఆర్కిటెక్చర్ అండ్ అర్బన్ డిజైన్‌లో ఎమ్మెస్సీ అభ్యసించేందుకు జర్మనీలోని స్టట్‌గార్ట్ విశ్వవిద్యాలయంలో అడుగుపెట్టాడు. జర్మనీలో నివసించడం, చదువుకోవడం, పనిచేయడం చేయడం వంటి అనుభవాలు ఒక వైవిధ్యభరితమైన అంతర్జాతీయ వాతావరణాన్ని అతడికి పరిచయం చేశాయి. ఇది విద్యాపరమైన అవగాహనే కాకుండా.. సమాజం, పర్యావరణ పరిరక్షణ, పట్టణాభివృద్ధి పట్ల అతని దృక్పథాన్ని పూర్తిగా మార్చేసింది. ఆర్కిటెక్చర్, పట్టణ ప్రణాళికీ రంగాల్లో భారత్, జర్మనీ రెండు దేశాల శైలినీ క్షుణ్ణంగా పరిశీలించిన దీపాయన్.. తన జ్ఞానాన్ని స్వదేశంలో ఉపయోగించాలన్న కృతనిశ్చయంతో భారత్‌కు తిరిగొచ్చాడు. నేడు దీపాయన్ సొంతంగా ఆర్కిటెక్చరల్ సంస్థను నడుపుతూ, వృత్తిపరమైన సేవలతో సమాజానికి సేవలందించడమే కాకుండా, ఇతరులకు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తున్నాడు.

జాతీయ విదేశీ విద్యా పథకం (ఎన్‌వోఎస్) ద్వారా తమ జీవిత గమనాన్ని పూర్తిగా మార్చుకున్న వందలాది మంది షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల్లో దీపాయన్ ఒకరు. అగ్రశ్రేణి విదేశీ విశ్వవిద్యాలయాలలో పీజీ, డాక్టొరల్ చదువుల కోసం భారత ప్రభుత్వం ఈ పథకం కింద నిధులు అందిస్తుంది. ట్యూషన్ ఫీజు, ప్రయాణ ఖర్చులు, జీవన వ్యయం, ఇతర విద్యాపరమైన అవసరాలన్నీ ఈ పథకం పరిధిలోకి వస్తాయి. ప్రపంచస్థాయి విశ్వవిద్యాలయంలో ప్రవేశానికి.. విద్యార్థి కుటుంబ ఆర్థిక పరిస్థితులు మాత్రమే ప్రాతిపదికగా ఉండొద్దన్న లక్ష్యంతో ఈ పథకానికి రూపకల్పన చేశారు. మొదటిసారిగా పాస్‌పోర్టును చూసిన కుటుంబాలున్నాయి. ఇక్కడున్న కాలేజీల్లోనే అడుగు కూడా పెట్టి ఉండని తల్లిదండ్రులు తమ పిల్లలను దూర దేశాలకు పంపిన ఉదాహరణలున్నాయి. ఇలా ఈ పథకంతో ముడిపడిన విజయగాథలు వందల్లో ఉన్నాయి. వార్షిక ఆదాయం ఎనిమిది లక్షల రూపాయల్లోపు ఉన్న కుటుంబాల విద్యార్థులకు 2014 నుంచి ఈ పథకం అండగా నిలుస్తోంది. బ్రిటన్ నుంచి జర్మనీ వరకు, అమెరికా నుంచి ఆస్ట్రేలియా వరకు.. 21 దేశాల్లోని ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో చదువుకునేందుకు ఈ పథకం వెన్నుదన్నుగా ఉంటోంది. ఇలాంటి ఎన్నో కుటుంబాలకు కనీసం విదేశీ విశ్వవిద్యాలయాలలో ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా.. దగ్గర్లో ఉన్న ఏదైనా ఒక సైబర్ కేఫ్‌పై ఆధారపడవలసి వచ్చే పరిస్థితి ఉండేది. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వైతిలింగం రాజేంద్రన్ రోజువారీ కూలీ పనులు చేసుకునే దంపతుల కుమారుడు. అమెరికాలోని ఒక్లహామా స్టేట్ యూనివర్సిటీ నుంచి రసాయన శాస్త్రంలో పీహెచ్‌డీ పట్టా పొందారు. తన పాఠశాల, డిగ్రీ చదువులను స్థానికంగా ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే పూర్తిచేశారు. ఉన్నత చదువులు చదివే క్రమంలో తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొన్నప్పటికీ.. పట్టుదల, నిరంతర శ్రమతో పరిశోధనలను విజయవంతంగా పూర్తి చేశారు. ఆపై శాస్త్రవేత్తగా విశిష్ట గుర్తింపును దక్కించుకున్నారు.

విదేశాల నుంచి కేవలం ఒక డిగ్రీనో, లేదా లక్షల జీతం వచ్చే ఉద్యోగాన్ని మాత్రమే ఈ విద్యార్థులు తీసుకురావడం లేదు.. తమ సమాజం కోసం సరికొత్త ఆశలను, అపారమైన అవకాశాలను, ఉన్నత ఆశయాలను మోసుకొస్తున్నారు. సాధారణంగా జాతీయ విదేశీ విద్య వంటి పథకాలను ఆర్థిక సాయం అందించే కార్యక్రమాలుగానే చూస్తుంటారు. కానీ నిజానికి అది మానవ వనరుల అభివృద్ధిపై, విజ్ఞానంపై పెట్టే దీర్ఘకాలిక పెట్టుబడి. రోడ్లు, వంతెనలు, విమానాశ్రయాలతో మాత్రమే అభివృద్ధి చెందిన దేశాలు రూపుదిద్దుకోవు. తరగతి గదుల్లోనూ అవి సాకారమవుతాయి. ఇలాంటి స్కాలర్‌షిప్పులతో దేశాన్ని దాటి వెళ్లే ప్రతి విద్యార్థి.. వికసిత్ భారత్ ఏ2047 అనే స్వప్నం సాకారమయ్యేలా ఆత్మవిశ్వాసాన్నీ, సామర్థ్యాన్నీ నింపుకొని తిరిగొస్తాడు. ఒక్క స్కాలర్‌షిప్ అందిస్తున్న ప్రతిఫలమిది. స్కాలర్‌షిప్‌ల ఆవశ్యకత చదువుకు నిధులందించడం మాత్రమే కాదు.. మొదటిసారిగా సరికొత్త విద్యా, సామాజిక ప్రపంచాల్లోకి అడుగుపెడుతున్న విద్యార్థుల కోసం ఒక సుస్థిరమైన, అనుకూలమైన వాతావరణాన్ని సృష్టించడం. తమ కుటుంబాల్లో మొదటితరం విద్యార్థులుగా ఎదుగుతున్న వారికి.. ప్రవేశం సాధించడమే కాదు. తర్వాత తమ విద్యా ప్రయాణాన్ని నిలబెట్టుకోవడమూ పెద్ద సవాలే. ఖరీదైన నగరాల్లో జీవన వ్యయం, పుస్తకాలు లేదా డిజిటల్ పరికరాల కొనుగోలు, వసతి, ఇతర అదనపు ఖర్చులను తట్టుకోవడం అసలైన పరీక్ష. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో స్కాలర్‌షిప్‌లు వారికి వెన్నుదన్నుగా నిలుస్తాయి. దీంతో విద్యార్థులు రోజువారీ ఆర్థిక ఇబ్బందుల గురించి ఆందోళన చెందకుండా, చదువుపై దృష్టిని కేంద్రీకరించగలుగుతారు. ఈ స్కాలర్‌షిప్ ఎలాంటి హంగూఆర్భాటాలు లేకుండా నిశ్శబ్దంగా సాగుతోంది. దీనికి పెద్దపెద్ద ప్రచార ఆర్భాటాలుగానీ, సెలబ్రిటీలతో ప్రకటనలుగానీ లేవు. గత 12 ఏళ్లలో కేవలం చదువులో ప్రతిభే ప్రాతిపదికగా 764 మంది విద్యార్థులు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన అంతర్జాతీయ కళాశాలల్లో ప్రవేశం పొందారు. మిగతా పథకాలకు భిన్నంగా.. ఈ జాతీయ విదేశీ విద్యా పథకం ఒక్కో విద్యార్థికి అందించే సాయం ప్రత్యేకంగా ఉంటుంది. ప్రపంచస్థాయి అగ్రశ్రేణి విశ్వవిద్యాలయంలో ఉన్నత చదువులు అభ్యసించే ఒక్కో విద్యార్థికీ కోర్సు కాల పరిమితిని బట్టి.. ట్యూషన్ ఫీజు, జీవన వ్యయం, విమాన ప్రయాణ ఖర్చులు, బీమా, ఇతర విద్యాపరమైన ఖర్చులన్నింటినీ కలిపి ఈ పథకం అందించే మొత్తం ఆర్థిక సాయం కోటి రూపాయల నుంచి, కొన్ని సందర్భాల్లో రెండు కోట్ల రూపాయల వరకూ ఉంటుంది.

సామాజికంగా వెనుకబడిన నేపథ్యం నుంచి వచ్చి, ఉన్నత ఆశయాలతో ముందడుగు వేసే ఒక్కో విద్యార్థిపైనా ఇంత భారీ మొత్తంలో పెట్టుబడిని అందించే ప్రభుత్వ విద్యా పథకాలు ప్రపంచవ్యాప్తంగా చాలా కొన్నే ఉన్నాయి. ఆర్థిక సహాయం మాత్రమే కాదు, దాని ద్వారా సాధించాలనుకునే లక్ష్యమే ఈ పథకంలో కీలకం. కేవలం కుటుంబ ఆర్థిక పరిస్థితులే.. కొన్ని వర్గాల విద్యార్థుల ఉన్నత అవకాశాలకు అవరోధంగా మారకూడదన్న దేశ సంకల్పాన్ని ఈ పథకం ప్రతిబింబిస్తోంది. వ్యక్తిగత మానవ సామర్థ్యాలను ఆవిష్కరించేందుకు విద్యారంగంలో పెట్టుబడికి సంబంధించి.. అత్యంత ప్రతిష్ఠాత్మకమైన, ఫలప్రదమైన ఉదాహరణల్లో ఇది ఒకటి. దేశీయ అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విదేశీ విద్యాభ్యాసం వరకు... షెడ్యూల్డ్ కులాల విద్యార్థుల కోసం మన దేశంలో ఏర్పాటు చేసిన స్కాలర్‌షిప్ వ్యవస్థ ఈ ఆశయాన్ని స్పష్టం చేస్తోంది. సామాజిక అభ్యున్నతి సాధించాలంటే విద్యా ప్రయాణంలో అవిచ్ఛిన్నత, స్థిరత్వం, నిరంతర మద్దతు అవసరమని ఇది గుర్తిస్తోంది. ఎన్నో గ్రామాలు, చిన్న పట్టణాలలో ఒక్క విద్యార్థి సాధించే విజయం.. ఒక తరం ఆలోచనా విధానాన్నే పూర్తిగా మార్చేస్తుంది. ఇంట్లో తమ్ముళ్లూ, చెల్లెళ్లూ మరింత ఆత్మవిశ్వాసంతో పోటీ పరీక్షలకు సిద్ధమవుతారు. విదేశీ విద్య అందని ద్రాక్ష కాదనీ, దాన్ని కూడా మనం చేరుకోగలమనీ ఊరికి నమ్మకం కలుగుతుంది. ఆక్స్‌ఫర్డ్, ఎంఐటీ, లేదా కొలంబియా విశ్వవిద్యాలయాల తరగతి గదులు.. మనదేశపు మారుమూల పల్లెలకు, చిన్న పట్టణాలకు భౌగోళికంగా ఎంతో దూరంగా ఉన్నట్టు అనిపించవచ్చు. కానీ, జాతీయ విదేశీ విద్యా పథకం వంటి స్కాలర్‌షిప్‌ల ద్వారా ఇప్పుడు ఆ దూరాలు మెల్లిమెల్లిగా చెరిగిపోతున్నాయి. జాతీయ విదేశీ విద్యా పథకానికి (ఎన్‌వోఎస్) సంబంధించిన దరఖాస్తు ప్రక్రియను కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ పర్యవేక్షిస్తుంది. అర్హులైన అభ్యర్థులు నేషనల్ స్కాలర్‌షిప్ పోర్టల్ ద్వారా 2026 జూన్ 2 లోపు దరఖాస్తు చేసుకోవచ్చు.



**రచయిత: సుధాన్షు పంత్**
**కేంద్ర సామాజిక న్యాయం, సాధికారతా శాఖ కార్యదర్శి**

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.